manavishwam.com

# మన విశ్వం

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక

MANA VISHWAM TELUGU DAILY




వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 69 | మంగళవారం 25 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల : రూ.5 | PRGI, NO : TGTEL/26/A4450 | ఎడిటర్ : నమిండ్ల ప్రమోద్

## 22ఏపై అపోహలొద్దు..

# అక్రమాలకే అడ్డుకట్ట

- లక్షల ఎకరాలు కొత్తగా నిషేధిత జాబితాలో చేర్చామనడం అవాస్తవం
- దరఖాస్తులకు ఫాస్ట్‌ట్రాక్ పరిష్కారం.. 98% రిజిస్ట్రేషన్లు పూర్తి
- నకిలీ జీవోలు, బోగస్ మెమోలతో భూదందాలకు చెక్
- ప్రభుత్వ భూములను ప్రైవేటుపరం కానివ్వం
- యూఎల్‌సీపై త్వరలో విధాన నిర్ణయం: పొంగులేటి

వివరాలు 2లో..



## ఓటర్ల జాబితా పారదర్శకతకు


# గ్రామ సభలు




- గైర్హాజరు, మృతి, వలస, నకిలీ ఓటర్ల వివరాల బహిరంగ పఠనం
- అనామలీస్, నో-మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు వేగవంతం
- 18 ఏళ్లు నిండేవారి నమోదుపై విస్తృత అవగాహన
- రాజకీయ పార్టీలతో వారానికోసారి సమావేశాలు
- అధికారులకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 24 (మన విశ్వం):** ఓటర్ల జాబితా శుద్ధిలో ఇక ప్రజలకూ భాగస్వామ్యం కల్పించనున్నారు. జాబితాలో తప్పులు, అనర్హుల పేర్లను గుర్తించడంతో పాటు అర్హులెవరూ ఓటుహక్కు కోల్పోకుండా గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈ సభలను సమర్థంగా నిర్వహించి పారదర్శకంగా జాబితా సవరణ చేపట్టాలని స్పష్టం చేశారు. సోమవారం జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన సమీక్షించారు. గ్రామ, వార్డు సభల్లో గైర్హాజరైన, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన, మరణించిన, నకిలీగా గుర్తించిన ఓటర్ల వివరాలను బీఎల్‌వోలు బహిరంగంగా చదివి వినిపించాలన్నారు. ముసాయిదా జాబితాలోని పేర్లను వెల్లడించి ప్రజల నుంచి మిగతా 2లో..

# ఆడిట్‌కు 'లంచం' లెక్క!



- అనుకూల నివేదిక కోసం రూ.లక్ష డిమాండ్.. చివరకు రూ.50 వేలకు బేరం
- లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన నిర్మల్ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్
- సీనియర్ అసిస్టెంట్‌కూ ఉచ్చు.. రూ.50 వేల నగదు స్వాధీనం

**నిర్మల్, ఆగస్టు 24 (మన విశ్వం):** వ్యాపార సంస్థకు అనుకూలంగా ఆడిట్ నివేదిక ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన రాష్ట్ర పన్నుల శాఖకు చెందిన ఇద్దరు ఉద్యోగులు ఏసీబీకి చిక్కారు. నిర్మల్ సర్కిల్ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్ కొప్పెల గడావరి, అసిస్టెంట్ కమిషనర్ (స్టేట్ ట్యాక్స్) కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మంత్రి సాయి కృష్ణను సోమవారం ఆదిలాబాద్ రేంజ్ ఏసీబీ అధికారులు ట్రాప్ చేశారు. ఏసీబీ వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన వ్యాపారికి మిగతా 2లో..




# తెలంగాణ హక్కులనే కాలరాస్తారా?

- అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం
- గుజరాత్ సీఎంకు ఓకే.. తెలంగాణ సీఎంకు నో ఎందుకు?
- రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే రాజకీయ నిర్ణయమని ధ్వజం
- ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం తీరు
- ఇది నా అవమానం కాదు.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయం
- పర్యటనను అడ్డుకోవచ్చు.. తెలంగాణ ప్రగతిని ఆపలేరు: రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 24 (మన విశ్వం):** రాష్ట్ర అభివృద్ధి కోసం తలపెట్టిన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంగ్లాండ్ పర్యటనకు అనుమతిచ్చి.. అమెరికా వెళ్లేందుకు అడ్డుపడటం తెలంగాణ పట్ల వివక్ష కాదా? అని ప్రశ్నించారు. గుజరాత్ ముఖ్యమంత్రి అమెరికా, కెనడాల్లో పర్యటించేందుకు అనుమతించిన కేంద్రం.. తెలంగాణ ముఖ్యమంత్రి పర్యటనకు మాత్రం ఎందుకు మోకాలడ్డుతోందో ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం సచివాలయంలో రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యాలను ప్రపంచానికి పరిచయం చేయడంతోపాటు విద్య, క్రీడలు, పెట్టుబడుల రంగాల్లో అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలు నెలకొల్పేందుకే విదేశీ పర్యటన రూపొందించినట్లు తెలిపారు. పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలను విదేశాంగ శాఖకు ముందుగానే సమర్పించినప్పటికీ అమెరికా వెళ్లేందుకు అనుమతి ఇవ్వకపోవడం వెనుక రాజకీయ కారణాలున్నాయని ఆరోపించారు.

**గుజరాత్‌కు ఒక నీతి.. తెలంగాణకు మరో నీతా?**

'వైబ్రంట్ గుజరాత్' కోసం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విదేశాలకు వెళ్లొచ్చు.. 'తెలంగాణ రైజింగ్' కోసం తెలంగాణ ముఖ్యమంత్రి వెళ్లకూడదా? అని రేవంత్ నిలదీశారు. తన పర్యటనలో అభ్యంతరకర అంశాలుంటే ఇంగ్లాండ్‌కు కూడా అనుమతి ఇవ్వకూడదన్నారు. ఒక దేశానికి అనుమతించి.. మరో దేశానికి మిగతా 2లో..

# నా కదలికలపై నిఘా ఎందుకు?



- డీజీపీకి ఎంపీ ధర్మపురి అరవింద్ బహిరంగ లేఖ
- ఏసీపీ స్థాయి అధికారిని నియమించారంటూ ఆరోపణ
- రాజకీయ కుటుంబాల ఆదేశాలతో పోలీసులు పనిచేస్తున్నారా?
- చట్టం, రాజ్యాంగానికే జవాబుదారీగా ఉండాలని హితవు
- నిఘాపై వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్

**తెలంగాణ బ్యూరో, ఆగస్టు 24 (మన విశ్వం):** తన కదలికలపై తెలంగాణ పోలీసులు నిఘా పెట్టారంటూ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన ఆరోపణలు చేశారు. తనను పర్యవేక్షించేందుకు ఏసీపీ స్థాయి అధికారిని ప్రత్యేకంగా నియమించినట్లు సమాచారం అందిందని పేర్కొంటూ డీజీపీ సీవీ ఆనంద్‌కు బహిరంగ లేఖ రాశారు. ఈ వ్యవహారంపై వాస్తవాలేమిటో మిగతా 2లో..

# యువతకు కొలువులేవీ..?

## మద్యానికి 121 బ్రాండ్లు!

- జాబ్ నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగుల ఎదురుచూపులు
- 121 మద్యం బ్రాండ్లకు మాత్రం ఆఘమేఘాలపై నోటిఫికేషన్లు
- యువత భవిష్యత్తు కంటే మద్యం అమ్మకాలే ముఖ్యమా?
- 'ఇదేనా రేవంత్ ప్రజాపాలన?' అంటూ హరీశ్‌రావు నిలదీత



వివరాలు 2లో..

- పూర్తిస్థాయి సబ్ రిజిస్ట్రార్లు లేక అస్తవ్యస్త పాలన
- తాత్కాలిక అధికారమే అదునుగా కొందరి ఇష్టారాజ్యం?
- అక్రమాలకు ఆస్కారం పెరుగుతోందన్న ఆరోపణలు
- కీలక శాఖలో రెగ్యులర్ అధికారుల కొరతపై విమర్శలు
- పూర్తిస్థాయి సబ్ రిజిస్ట్రార్ల నియామకం ఎప్పుడు?




# ఇన్‌ఛార్జీల చేతిలో 'రిజిస్ట్రేషన్'!

### ఉమ్మడి వరంగల్‌లో సగానికిపైగా కార్యాలయాల్లో ఇదే పరిస్థితి

**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 24 (మన విశ్వం):** భూములు, ఇళ్లు, ఇతర స్థిరాస్తుల క్రయవిక్రయాల్లో కీలకమైన స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఉమ్మడి వరంగల్‌లో ఇన్‌ఛార్జీల పాలనలో నెట్టుకొస్తోంది. సగానికిపైగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పూర్తిస్థాయి సబ్ రిజిస్ట్రార్లు లేకపోవడంతో ఇన్‌ఛార్జీలే దిక్కవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కీలకమైన శాఖలో ఈ పరిస్థితి దీర్ఘకాలంగా కొనసాగుతుండటంతో పరిపాలన, పర్యవేక్షణ గాడితప్పుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి.

**రెగ్యులర్ అధికారి కరవు**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిత్యం కోట్ల రూపాయల విలువైన స్థిరాస్తుల లావాదేవీలు మిగతా 2లో..



# కలెక్టర్ చెప్పినా.. కదలరా?

### తాడిచర్ల-ఖమ్మంపల్లి రోడ్డు వేసేదెప్పుడు?



- మల్హార్‌లో రోడ్లకు ఏఎంఆర్ భారీ వాహనాల దెబ్బ
- తాడిచర్ల ఆసుపత్రి మలుపులో పొంచి ఉన్న ప్రమాదం
- దబ్బగట్టులో గుంతలమయమైన రహదారి.. ప్రయాణికుల అవస్థలు
- సీఎస్ఆర్ నిధులతో బాగుచేయాలన్న ఆదేశాలు బేఖాతరు?
- కోట్ల నిధులు ఎటు పోతున్నాయంటూ స్థానికుల నిలదీత

**మల్హార్, ఆగస్టు 24 (మన విశ్వం):** భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు ఛిద్రమవుతున్నాయి. గుంతలు ప్రమాదాలకు నిలయాలవుతున్నాయి. ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. అయినా మరమ్మతులకు మోక్షం కలగడం లేదు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ మండలంలో ఏఎంఆర్ కార్యకలాపాలు సాగుతున్న ప్రాంతాల్లో రహదారుల దుస్థితిపై స్థానికులు మండిపడుతున్నారు. సీఎస్ఆర్ నిధులతో రోడ్లను బాగుచేయాలని కలెక్టర్ ఆదేశించినా పరిస్థితి మిగతా 2లో..

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

# గతం నేర్పిన పాఠమే.. రేపటికి దిక్సూచి



చరిత్రను చదవడమంటే గతంలోకి తొంగిచూడటం మాత్రమే కాదు. వర్తమానాన్ని అర్థం చేసుకుని.. భవిష్యత్తును జాగ్రత్తగా నిర్మించుకోవడం. మానవాళి సాగించిన సుదీర్ఘ ప్రయాణంలో విజయాలున్నాయి.. ఘోర వైఫల్యాలున్నాయి. యుద్ధాలు, నియంతృత్వాలు, వివక్షలు, విప్లవాలు, స్వాతంత్ర్య పోరాటాలు ఎన్నో పాఠాలు నేర్పాయి. వాటిని గుర్తుంచుకున్నంతకాలం సమాజం అప్రమత్తంగా ఉంటుంది. విస్మరించినప్పుడే పాత తప్పులు కొత్త రూపంలో తిరిగివస్తాయి.

ప్రపంచాన్ని వణికించిన రెండు మహాయుద్ధాలు ఇందుకు నిలువెత్తు ఉదాహరణలు. అధికార కాంక్ష, ఆధిపత్య పోరు, జాత్యహంకారం ఎంతటి విధ్వంసానికి దారితీస్తాయో అవి చూపించాయి. కోట్లాది ప్రాణాలు పోయాయి. దేశాలు శిథిలమయ్యాయి. తరాలు కోలుకోలేని గాయాలు మిగిలాయి. నియంతృత్వ పాలనలు ప్రజల స్వేచ్ఛను కాలరాశాయి. మతం, జాతి, వర్గం పేరుతో చెలరేగిన విద్వేషం సమాజాలను చీల్చింది. ఇవన్నీ పుస్తకాల్లో చదివి వదిలేయాల్సిన ఘట్టాలు కావు. మళ్లీ అలాంటి పరిస్థితులు తలెత్తకుండా హెచ్చరించే ప్రమాద ఘంటికలు.

మన స్వాతంత్ర్య సంగ్రామం చెప్పే సందేశమూ అంతే విలువైనది. నేడు అనుభవిస్తున్న స్వేచ్ఛ ఒక్కరోజులో సిద్ధించింది కాదు. తరాల త్యాగాలు, పోరాటాలు, నిర్బంధాలు, బలిదానాల ఫలితమది. ప్రజాస్వామ్యం కూడా ఎవరో ఇచ్చిన కానుక కాదు. ప్రజలు సాధించుకున్న హక్కు. ఆ నేపథ్యం తెలియని తరానికి స్వేచ్ఛ విలువ పూర్తిగా అర్థం కాకపోవచ్చు. అందుకే స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం కార్యక్రమాలకే పరిమితం కాకూడదు. వారు నిలబెట్టిన ప్రజాస్వామ్య, సమానత్వ విలువలను కాపాడటమే వారికి నిజమైన నివాళి.

చరిత్ర విజయాలను పొగడటానికే కాదు.. వైఫల్యాలను విశ్లేషించేందుకూ ఉపయోగపడాలి. ఒక దేశం ఆర్థిక సంక్షోభంలోకి ఎందుకు జారింది? సామాజిక అసమానతలు ఎందుకు పెరిగాయి? ప్రజల్లో అసంతృప్తి ఎలా ఉద్యమంగా మారింది? పాలకుల నిర్ణయాల్లో ఎక్కడ పొరపాటు జరిగింది? వీటికి గతంలో సమాధానాలు వెతికితే వర్తమానానికి విలువైన మార్గదర్శనం లభిస్తుంది. గతంలో చేసిన తప్పును గుర్తించకుండా అదే విధానాన్ని కొనసాగిస్తే మూల్యం చెల్లించాల్సింది ప్రజలే.

ఇక్కడే నేటి తరానికి పెద్ద సవాల్ ఎదురవుతోంది. చేతిలో చరవాణి ఉంటే ప్రపంచ సమాచారం క్షణాల్లో అందుతోంది. కానీ సమాచారం పెరిగినంతగా చరిత్రపై అవగాహన పెరుగుతోందా అన్నది ప్రశ్న. సామాజిక మాధ్యమాల్లో కొన్ని వాక్యాలు, చిన్న వీడియోలే చరిత్రగా చలామణి అవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. నిజానిజాలు తెలుసుకోకుండా వాటినే నమ్మితే వాస్తవ చరిత్ర కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. గతాన్ని రాజకీయ అవసరాలకు అనుగుణంగా వక్రీకరించడం మరింత ప్రమాదకరం. చరిత్ర ఎవరి ప్రచారాస్త్రమూ కాకూడదు. వాస్తవాలను ఆధారాలతో భావితరాలకు అందించాలి.

విద్యావ్యవస్థలోనూ మార్పు అవసరం. విద్యార్థులతో తేదీలు, పేర్లు బట్టీ పట్టించడం మాత్రమే చరిత్ర బోధన కాదు. ఒక సంఘటన ఎందుకు జరిగింది? దాని వెనుక పరిస్థితులేమిటి? సమాజంపై ఎలాంటి ప్రభావం చూపింది? దాని నుంచి ఏం నేర్చుకోవాలి? అనే ఆలోచనను రేకెత్తించాలి. అప్పుడే చరిత్ర పాఠ్యపుస్తకంలోని అధ్యాయం నుంచి జీవితానికి ఉపయోగపడే పాఠంగా మారుతుంది.

ఒక జాతి చరిత్ర దాని అస్తిత్వానికి మూలం. భాష, సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, కట్టడాలు, ప్రజల జీవన విధానం.. అన్నింటి వెనుక గతం ఉంటుంది. చారిత్రక కట్టడాలు కూలిపోతుంటే చూస్తూ ఊరుకోవడం, పురావస్తు సంపదను నిర్లక్ష్యం చేయడం అంటే మన మూలాలను మనమే చెరిపేసుకోవడమే. వాటి సంరక్షణ ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు.. సమాజానిదీ. చరిత్ర పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వాలి. ఆధారాలను భద్రపరచాలి. భావితరాలకు వాస్తవాలను అందించాలి.

గతంలో జరిగిన విషాదాలను దాచిపెట్టడం వల్ల అవి జరగలేదని కాదు. తప్పులను అంగీకరించే ధైర్యం, వాటి నుంచి నేర్చుకునే పరిణతి ఉన్నప్పుడే సమాజం ముందుకు సాగుతుంది. ద్వేషం ఎక్కడికి తీసుకెళ్లిందో, నియంతృత్వం ఎలాంటి మూల్యం చెల్లింపజేసిందో, విభజన రాజకీయాలు ఎంతటి నష్టాన్ని మిగిల్చాయో చరిత్ర ఇప్పటికే చెప్పింది. అయినా అదే దారిలో అడుగులు వేస్తే అది గతం చేసిన తప్పు కాదు.. వర్తమానం చేస్తున్న తప్పే అవుతుంది.

గతాన్ని గుర్తుంచుకోవడమంటే వెనక్కి నడవడం కాదు. ముందున్న ప్రమాదాలను ముందుగానే గుర్తించడం. చరిత్రలోని విజయాల నుంచి స్ఫూర్తి పొందాలి. వైఫల్యాలనుంచి గుణపాఠం నేర్చుకోవాలి. చరిత్రను భద్రపరచడం అంటే జ్ఞాపకాలను కాపాడటం మాత్రమే కాదు.. భవిష్యత్ ను కాపాడటం. గతం చెప్పిన పాఠాన్ని విస్మరిస్తే.. అదే తప్పుకు మరోసారి మూల్యం చెల్లించక తప్పదు.

– నమిండ్ల. ప్రమోద్, ఎడిటర్

# ఓటర్ల జాబితా పారదర్శకతకు గ్రామ సభలు

(మొదటిపేజీ తరువాయి)

అభిప్రాయాలు, అభ్యంతరాలు స్వీకరించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్నప్పటికీ జాబితాలో పేరు చేరని వారి వివరాలను గుర్తించి పరిశీలించాలని ఆదేశించారు.

**18 ఏళ్లు నిండితే నమోదు**

2026 అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండే అర్హులైన భారతీయ పౌరులు ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత ప్రచారం చేపట్టాలని సుదర్శన్‌రెడ్డి సూచించారు. పేర్ల తొలగింపునకు ఫారం-7, వివరాల సవరణకు ఫారం-8 వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, ధ్రువీకరణకు అవసరమైన పత్రాల వివరాలనూ సభల్లో తెలియజేయాలని చెప్పారు.

**అనామలీస్‌పై నోటీసులు వేగంగా..**

ఎస్ఐఆర్ ప్రక్రియలో అనామలీస్, నో-మ్యాపింగ్ కేసులకు సంబంధించిన ఓటర్లకు నోటీసుల జారీని వేగవంతం చేయాలని ఆదేశించారు. నోటీసుల్లో విచారణ స్థలం, తేదీ, సమయాన్ని తప్పనిసరిగా పేర్కొనాలన్నారు. ఓటర్లు సమర్పించే పత్రాలను సక్రమంగా నమోదు చేసి విచారణ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. నామలీస్, నో-మ్యాపింగ్ జాబితాలను రాజకీయ పార్టీలతో పంచుకోవాలని, అన్ని పార్టీలకు సమాన సమాచారం అందించాలని సూచించారు. ఇందుకోసం వారానికోసారి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. గ్రామ, వార్డు సభల వివరాలను నమోదు చేసి భవిష్యత్ పరిశీలనకు భద్రపరచాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అర్హుడికి ఓటుహక్కు కల్పించడం, అనర్హులను గుర్తించి జాబితాను శుద్ధి చేయడం, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచడమే లక్ష్యమని సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# కలెక్టర్ చెప్పినా.. కదలరా?

(మొదటిపేజీ తరువాయి)

మారకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



**కలెక్టర్ ఆదేశాలకూ విలువ లేదా?**

తాడిచర్ల నుంచి ఖమ్మంపల్లి మీదుగా మంథనికి వెళ్లే ప్రధాన రహదారి రెండుమూడేళ్లుగా అధ్వానంగా మారింది. ఏఎంఆర్ సంస్థకు చెందిన భారీ వాహనాల రాకపోకలతోనే రోడ్డు పూర్తిగా దెబ్బతిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో పనిచేసిన కలెక్టర్లతోపాటు ప్రస్తుత కలెక్టర్ కూడా సీఎస్ఆర్ నిధులతో రహదారిని బాగుచేయాలని పలుమార్లు సూచించినట్లు చెబుతున్నారు. అయినా పనులు చేపట్టకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారి ఆదేశాలే అమలుకాకపోతే తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని వాపోతున్నారు.

**ఆసుపత్రి మలుపులో ముప్పు**

తాడిచర్ల ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని మూలమలుపు ప్రమాదకరంగా మారింది. రోడ్డు దెబ్బతినడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, గర్భిణులు, ఇతర ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు అదుపుతప్పే ప్రమాదమున్నా కనీస మరమ్మతులు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగి ప్రాణాలు పోయాకే స్పందిస్తారా? అని నిలదీస్తున్నారు.

**దబ్బగట్టులో గుంతలే గుంతలు**

మల్లారం పరిధిలోని దబ్బగట్టు రహదారి పరిస్థితీ దయనీయంగా మారింది. ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. వర్షం పడితే వాటిలో నీరు నిలిచి రోడ్డేదో.. గుంతేదో తెలియని పరిస్థితి నెలకొంటోంది. ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు మరింత దెబ్బతింటోందని గ్రామస్థులు చెబుతున్నారు.

**మూడేళ్లుగా అదే దుస్థితి**

తాడిచర్ల-ఖమ్మంపల్లి మార్గం మంథనికి వెళ్లేందుకు కీలకమైనది. ఈ రహదారి దాదాపు మూడేళ్లుగా అధ్వానంగా ఉన్నా శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏఎంఆర్ భారీ వాహనాలతో దెబ్బతిన్న రహదారిని అదే సంస్థ సీఎస్ఆర్ నిధులతో బాగుచేయాలన్న ఆదేశాలు ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నిస్తున్నారు.

**సీఎస్ఆర్ కోట్ల లెక్కేదీ?**

ఏఎంఆర్ సంస్థ సీఎస్ఆర్ కింద ప్రభావిత గ్రామాలకు ఇప్పటివరకు ఎంత నిధులు కేటాయించింది? ఎంత ఖర్చు చేసింది? ఏయే అభివృద్ధి పనులు చేపట్టింది? రహదారుల కోసం ఎంత వెచ్చించింది? అనే వివరాలను బహిర్గతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కోట్ల రూపాయల కార్యకలాపాలు సాగుతున్న ప్రాంతంలో ప్రజలు మాత్రం గుంతల రోడ్లపై ప్రయాణించాల్సిన దుస్థితి ఎందుకని నిలదీస్తున్నారు. తాడిచర్ల-ఖమ్మంపల్లి-మంథని మార్గంతోపాటు దబ్బగట్టు, తాడిచర్ల ఆసుపత్రి మలుపు వద్ద రహదారులకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. సీఎస్ఆర్ నిధుల కేటాయింపు, ఖర్చుల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రమాదం జరగకముందే రోడ్లను బాగుచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# తెలంగాణ హక్కులనే కాలరాస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

నిరాకరించడం కేంద్రం వివక్షపూరిత వైఖరికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రాల సమాహారమే కేంద్ర ప్రభుత్వమన్న ప్రజాస్వామ్య, సమాఖ్య స్ఫూర్తిని గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ గుజరాత్‌కు మాత్రమే నాయకుడిగా కాకుండా దేశంలోని అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలని వ్యాఖ్యానించారు.

**'నన్ను కాదు.. తెలంగాణను అడ్డుకున్నారు'**

అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణను తనకు జరిగిన వ్యక్తిగత అవమానంగా చూడటం లేదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయమన్నారు. ముఖ్యమంత్రి విదేశీ పర్యటనను అడ్డుకోవడమంటే రాష్ట్రానికి పెట్టుబడులు, అవకాశాలు రాకుండా అడ్డుకోవడమేనని ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా కేంద్రం నిర్ణయాన్ని అన్ని వర్గాలూ ఖండించాలని కోరారు. తెలంగాణ ఎంపీలు ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతారని తెలిపారు. విద్య, క్రీడలు, పెట్టుబడుల రంగాల్లో ప్రపంచస్థాయి అవకాశాలను రాష్ట్రానికి తీసుకురావడమే తమ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. విదేశీ పర్యటనలు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని.. తెలంగాణ భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు.

**'పర్యటనను ఆపగలరు.. ప్రగతిని కాదు'**

తన అమెరికా పర్యటనను కేంద్రం అడ్డుకోగలదేమోగానీ తెలంగాణ అభివృద్ధి ఆకాం క్షలను అడ్డుకోలేదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. డిసెంబరు 8, 9 తేదీల్లో 'తెలంగా ణ గ్లోబల్ సమ్మిట్--2026' నిర్వహించి విద్య, క్రీడలు, పెట్టుబడుల రంగాల్లో అంతర్జాతీయ భాగస్వామ్యాలను రాష్ట్రానికి తీసుకొస్తామన్నారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా తెలంగాణ ప్రయోజనాల సాధనలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

# ఇన్‌ఛార్జీల చేతిలో 'రిజిస్ట్రేషన్'!

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతుంటాయి. భూముల హక్కులు, నిషేధిత జాబితాలు, వివాదాస్పద ఆస్తులు, ప్రభుత్వ భూములకు సంబంధించిన దస్త్రాల పరిశీలనలో సబ్ రిజిస్ట్రార్ పాత్ర కీలకం. అలాంటి కార్యాలయాల్లోనే పూర్తిస్థాయి అధికారులు లేకపోవడం చర్చనీయాంశమవుతోంది. రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లను నియమించకుండా ఇన్‌ఛార్జీలతోనే నెట్టుకురావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇన్‌ఛార్జీలదే హవా?

పూర్తిస్థాయి అధికారులు లేకపోవడాన్ని కొందరు ఇన్‌ఛార్జీలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దస్త్రాల పరిశీలన నుంచి రిజిస్ట్రేషన్ల వరకు నిబంధనల అమలులో పారదర్శకతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని చోట్ల ఇన్‌ఛార్జీల వ్యవస్థే అక్రమాలకు ఆస్కారం కల్పిస్తోందన్న ఆరోపణలూ ఉన్నాయి. వీటిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.

సగానికిపైగా చోట్ల ఇదే పరిస్థితి

ఉమ్మడి వరంగల్ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సగానికిపైగా చోట్ల పూర్తిస్థాయి అధికారులు లేరని తెలుస్తోంది. కీలకమైన ఆదాయ శాఖలో ఇంత పెద్ద సంఖ్యలో కార్యాలయాలను ఇన్‌ఛార్జీలతో కొనసాగించడం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసి రెగ్యులర్ అధికారులను నియమించాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్యలు కనిపించడం లేదన్న విమర్శలున్నాయి.

అమాత్యా.. నియామకాలెప్పుడు?

ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూర్చే రిజిస్ట్రేషన్ల శాఖలోనే పూర్తిస్థాయి అధికారుల కొరత కొనసాగడం విస్మయం కలిగిస్తోంది. ఇన్‌ఛార్జీ వ్యవస్థకు తెరదించి ప్రతి కార్యాలయానికీ రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఉమ్మడి వరంగల్ లో ఇన్చార్జీ ల పాలనకు ముగింపు పలికి పూర్తిస్తాయి సబ్ రిజిస్ట్రార్లను ఎప్పుడు నియమిస్తారో సంబంధిత అమాత్యే చెప్పాలి.




# 22ఏపై అపోహలొద్దు.. అక్రమాలకే అడ్డుకట్ట

**తెలంగాణ బ్యూరో, ఆగస్టు 24 (మన విశ్వం):** రాష్ట్రంలో లక్షల ఎకరాలను కొత్తగా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. 22ఏ పేరుతో ప్రజలను భయాందోళనలకు గురిచేయొద్దని ప్రతిపక్షాలకు సూచించారు. తమ ప్రభుత్వం వచ్చాక అందిన దరఖాస్తులను ఫాస్ట్‌ట్రాక్‌లో పరిష్కరిస్తోందని, రిలాక్సేషన్ పొందిన కేసుల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని తెలిపారు. సోమవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

**లెక్కలతోనే వాస్తవాలు**

2023 డిసెంబరు 7 నాటికి నిషేధిత జాబితాలో ఉన్న భూములు, ప్రస్తుతం ఉన్న విస్తీర్ణం, వాటి కేటగిరీల వివరాలను రికార్డులతో ప్రజల ముందుంచుతున్నామని మంత్రి చెప్పారు. ప్రభుత్వ, అటవీ, వక్ఫ్, దేవాదాయ, అసైన్డ్, కోర్టు ఆదేశాల పరిధిలోని భూముల వివరాలన్నీ వెల్లడిస్తున్నామన్నారు. లక్షల ఎకరాలను కొత్తగా 22ఏలో చేర్చామన్న ఆరోపణలు అవాస్తవమని పేర్కొన్నారు.

**ప్రభుత్వ భూమిని వదిలేది లేదు**

ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడటమే తమ లక్ష్యమని పొంగులేటి స్పష్టం చేశారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని రెండు రెవెన్యూ గ్రామాల్లో సుమారు 522 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన వ్యవహారాలను ఉదాహరణగా పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అన్నారంలో ప్రైవేటు సర్వే నంబరుతో అనుమతులు పొంది ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించామన్నారు. ఇలాంటి అక్రమాలను చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

**నకిలీ పత్రాలపై క్రిమినల్ కేసులు**

ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ కోసం నకిలీ జీవోలు, బోగస్ మెమోలు, ఫేక్ సర్టిఫికెట్లు సృష్టిస్తున్న ఘటనలు వెలుగుచూశాయని మంత్రి తెలిపారు. మేడ్చల్ జిల్లాలో కలెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పేర్లతో నకిలీ పత్రాలు తయారు చేసినట్లు గుర్తించామని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. నిజమైన హక్కుదారులకు మాత్రం అన్యాయం జరగనివ్వబోమన్నారు.

**36 గంటల్లోనే పరిష్కారం**

22ఏ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబరుకు 1,162 కాల్స్ రాగా.. పునరావృతమైనవి మినహాయిస్తే 980 ఫిర్యాదులు నమోదయ్యాయని పొంగులేటి తెలిపారు. వాటిలో 547 వ్యవసాయ, 433 వ్యవసాయేతర భూములకు సంబంధించినవన్నారు. నిజమైన 22ఏ సమస్యలను 24 గంటల్లో, అవసరమైతే గరిష్ఠంగా 36 గంటల్లో పరిష్కరించేలా ఫాస్ట్‌ట్రాక్ విధానం అమలు చేస్తున్నామని చెప్పారు. రిలాక్సేషన్ పొందిన కేసుల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని వివరించారు.

**యూఎల్‌సీపై త్వరలో నిర్ణయం**

అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములపై త్వరలో ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంటుందని మంత్రి వెల్లడించారు. యూఎల్‌సీ క్లియరెన్స్ పొందిన భూముల జీవోలు, ఉత్తర్వులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నామన్నారు. సీఎస్ -7, సీ ఎస్ -14కు సంబంధించిన 811 ఎకరాల వ్యవహారంపై ప్రధాన ప్రతిపక్షం కోరితే సెట్ దర్యాప్తునకు సిద్ధమని ప్రకటించారు. "ప్రజలను భయపెట్టడం కాదు.. భరోసా ఇవ్వడమే మా బాధ్యత. ప్రభుత్వ భూములను కాపాడతాం. న్యాయబద్ధమైన ప్రైవేటు ఆస్తులకు రక్షణ కల్పిస్తాం. తప్పు జరిగితే సరిదిద్దుతాం.. అక్రమం జరిగితే చర్యలు తప్పవు" అని పొంగులేటి స్పష్టం చేశారు.

# ఆడిట్‌కు 'లంచం' లెక్క!

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన శ్రీలక్ష్మీ ప్రసన్న జ్యువెలర్స్ 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల రికార్డుల ఆడిట్ విషయంలో అనుకూల నివేదిక ఇచ్చేందుకు నిందితులు తొలుత రూ.లక్ష లంచం డిమాండ్ చేశారు. పన్ను పరిధిలోకి వచ్చే టర్నోవర్, జీఎస్టీ బాధ్యతను తక్కువగా చూపేందుకు సహకరిస్తామని చెప్పినట్లు ఏసీబీ పేర్కొంది. వ్యాపారి విజ్ఞప్తులతో లంచం మొత్తాన్ని తొలుత రూ.90 వేలకు, ఆ తర్వాత రూ.80 వేలకు, చివరకు రూ.50 వేలకు తగ్గించారు.

**తీసుకున్నది ఒకరు.. అందుకున్నది మరొకరు**

ఫిర్యాదుదారుడి నుంచి రూ.50 వేలను స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్ గడావరి స్వీకరించి, ఆ మొత్తాన్ని సీనియర్ అసిస్టెంట్ సాయి కృష్ణకు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరి చేతులకు నిర్వహించిన రసాయన పరీక్షల్లో పాజిటివ్ ఫలితాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.

# యువతకు కొలువులేవీ.. ? మద్యానికి 121 బ్రాండ్లు!

### 'ఇదేనా రేవంత్ ప్రజాపాలన?' అంటూ హరీశ్‌రావు నిలదీత

**హైదరాబాద్, ఆగస్టు 24 (మన విశ్వం):** ఉద్యోగాల కోసం నిరుద్యోగులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. కొత్త నోటిఫికేషన్లు ఎప్పుడొస్తాయా అని ఆశగా చూస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఉద్యోగాల భర్తీ విషయంలో చూపని వేగాన్ని మద్యం బ్రాండ్ల విషయంలో చూపుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. 121 మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్లు విడుదల చేయడాన్ని ప్రస్తావిస్తూ ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఉద్యోగ నోటిఫికేషన్ల విడుదలలో మీనమేషాలు లెక్కిస్తున్న ప్రభుత్వం.. మద్యం బ్రాండ్ల విషయంలో మాత్రం ఆఘమేఘాలపై నిర్ణయాలు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. యువత భవిష్యత్తుకు భరోసా కల్పించే ఉద్యోగాల కంటే మద్యం అమ్మకాలపైనే ప్రభుత్వానికి ఎక్కువ శ్రద్ధ ఉందా అని నిలదీశారు. " జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్ లు ఫుల్.. ఇదేనా రేవంత్ రెడ్డి ప్రజాపాలన?" అంటూ హరీష్ రావు ఎద్దేవా చేశారు.

# నా కదలికలపై నిఘా ఎందుకు?

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలకు వెల్లడించాలని కోరారు. తనపై నిఘా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు సాగుతోందనే సమాచారం తనకు అందిందని అరవింద్ లేఖలో ఆరోపించారు. సీవీ ఆనంద్‌ను సమర్థ అధికారిగా దశాబ్దాలుగా తెలుసునని, అలాంటి అధికారి నేతృత్వంలోని పోలీసుశాఖలో తనపై నిఘాకు ప్రత్యేక అధికారిని నియమించారన్న సమాచారం ఆందోళన కలిగిస్తోందన్నారు.

**చట్టం ప్రకారమా.. రాజకీయ ఆదేశాలతోనా?**

తెలంగాణ పోలీసుశాఖ రాజ్యాంగం, చట్టాలకు లోబడి పనిచేస్తోందా? లేక రాజకీయ కుటుంబాల ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తోందా? అనే ప్రశ్న తలెత్తుతోందని అరవింద్ పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థ రాజకీయ ప్రభావాలకు అతీతంగా ఉండాలని, చట్టం.. రాజ్యాంగానికే జవాబుదారీగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. తన కదలికల పర్యవేక్షణకు నిజంగానే ఏసీపీ స్థాయి అధికారిని నియమించారా? అలా అయితే ఎవరి ఆదేశాలతో ఈ నిర్ణయం తీసుకున్నారు? అధికారిక ఉత్తర్వులు ఉన్నాయా? అనే అంశాలపై డీజీపీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అరవింద్ ఆరోపణలపై పోలీసుశాఖ లేదా ప్రభుత్వ వర్గాల నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.

## అనారోగ్యంతో మనస్తాపం.. యువతి ఆత్మహత్య



**కొమురంభీం, ఆగస్టు 24 (మన విశ్వం):** అనారోగ్య సమస్యలతో మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాగజ్‌నగర్ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. తైబానగర్‌కు చెందిన సుమాయా మహేక్ (18) నాలుగు నెలలుగా రక్తహీనత, కడుపునొప్పితో బాధపడుతోంది. చికిత్స పొందుతున్నప్పటికీ ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు.
ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూమ్‌లో ఉరివేసుకుంది. కుటుంబసభ్యులు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబసభ్యులు పేర్కొన్నారు.

# బెల్టు దుకాణాలు బంద్ చేయాలి

- కాగజ్‌నగర్‌లో మహిళల ధర్నా
- అక్రమ మద్యంతో కుటుంబాలు ఛిద్రమవుతున్నాయని ఆవేదన
- సరఫరా మూలాలపై నిఘా పెట్టాలని కలెక్టర్, ఎస్పీకి విజ్ఞప్తి

**కొమురంభీం, ఆగస్టు 24 (మన విశ్వం):** గ్రామాల్లో విచ్చలవిడిగా సాగుతున్న అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని మహిళలు రోడ్డెక్కారు. కాగజ్‌నగర్ మండలం



దుర్గానగర్ నంబర్--5లో బెల్టు దుకాణాలను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. బెల్టు దుకాణాలు అందుబాటులో ఉండటంతో పలువురు మద్యానికి బానిసలవుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. సంపాదనలో ఎక్కువ భాగం మద్యానికే ఖర్చవుతుండటంతో కుటుంబ పోషణ భారంగా మారుతోందని, పిల్లల చదువులపైనా తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. అక్రమ మద్యం విక్రయాల కారణంగా కుటుంబాల్లో గొడవలు పెరుగుతున్నాయని వాపోయారు. అనంతరం ఈస్గాం పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. కేవలం తనిఖీలతో సరిపెట్టకుండా బెల్టు దుకాణాలకు మద్యం ఎక్కడి నుంచి సరఫరా అవుతోందో గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి అక్రమ మద్యం విక్రయాలకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేశారు.

# వైద్య కళాశాల ఖాళీల భర్తీకి ఎంపిక పరీక్ష

- సందీప్ కుమార్ ఝా పర్యవేక్షణలో 25 అధ్యాపక పోస్టులకు నియామకాల చర్యలు
- పారదర్శకంగా నిర్వహించిన ఎంపిక ప్రక్రియ
- అభ్యర్థుల నుంచి విశేష స్పందన

**జనగామ, ఆగస్టు 24 (మన విశ్వం):** జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా సోమవారం ఎంపిక పరీక్ష నిర్వహించారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జరిగిన ఈ పరీక్షకు అర్హులైన అభ్యర్థులు హాజరయ్యారు. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం ఈ ప్రక్రియ చేపట్టారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ 6, అసోసియేట్ ప్రొఫెసర్ 12, అసిస్టెంట్ ప్రొఫెసర్ 7 పోస్టులు కలిపి మొత్తం 25 ఒప్పంద ప్రాతిపదిక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ నియామకాల కోసం మొత్తం 13 దరఖాస్తులు అందగా, 10 మంది అభ్యర్థులు ఎంపిక పరీక్షకు



హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఎంపిక ప్రక్రియను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. నియామకాలు పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థుల అర్హతలు, ప్రతిభ ఆధారంగానే ఎంపికలు చేపడుతున్నామని పేర్కొన్నారు.
ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నాణ్యమైన వైద్య విద్య అందించాలంటే అధ్యాపకుల భర్తీ అత్యంత కీలకమని అధికారులు అభిప్రాయపడ్డారు. ఖాళీల భర్తీతో విద్యార్థులకు మెరుగైన బోధన అందడంతో పాటు వైద్య కళాశాల కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా కొనసాగనున్నాయని తెలిపారు. వైద్య విద్యా రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు అవసరమైన అధ్యాపక సిబ్బంది నియామకంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఖాళీల భర్తీ ద్వారా విద్యార్థులకు ప్రయోజనం చేకూరడంతో పాటు వైద్య సేవల నాణ్యత కూడా మెరుగుపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. నాగమణి, జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆర్. కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. ఎంపిక ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

## భూముల రీ సర్వే వేగవంతం చేయాలి




- రోజుకు 40 ఎకరాల సర్వే పూర్తి చేయాలని ఆదేశం
- సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచన
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ సత్యప్రసాద్ స్పష్టం

**జగిత్యాల, ఆగస్టు 24 (మన విశ్వం):** జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి ప్రతి రోజు కనీసం 40 ఎకరాల భూమిని సర్వే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రీ సర్వే పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో భూముల రీ సర్వే, భూ భారతి, సాదాబైనామా తదితర అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.ఎస్. లతతో పాటు రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో జరుగుతున్న రీ సర్వే పురోగతిని కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ఆయా మండలాల వారీగా ఇప్పటివరకు ఎన్ని ఎకరాల భూమిని రీ సర్వే చేశారో, అందులో ప్రభుత్వ భూములు, పట్టా భూములు ఎంత మేర గుర్తించారో సంబంధిత తహసీల్దార్లు, సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. భూముల రికార్డులను పారదర్శకంగా రూపొందించడం ద్వారా భవిష్యత్తులో భూవివాదాలు తగ్గే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. రీ సర్వే ప్రక్రియలో ఖచ్చితత్వం, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రతి దశలో సంబంధిత వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. భూ భారతి, సాదాబైనామా అంశాలకు సంబంధించిన పెండింగ్ వ్యవహారాలను కూడా వేగంగా పరిష్కరించాలని సమావేశంలో సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని దరఖాస్తులను పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో చేపడుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని, భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని ఆదేశించారు.

# అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

- రూ.12 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- వరుస చోరీల కేసుల్లో కీలక పురోగతి
- మహారాష్ట్రకు చెందిన నిందితుడి అరెస్టు
- పోలీసు బృందాన్ని అభినందించిన కమిషనర్

**వరంగల్ క్రైం , ఆగస్టు 24 (మన విశ్వం):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న ఓ అంతర్రాష్ట్ర దొంగను మిల్స్ కాలనీ పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.12 లక్షల విలువైన 70.19 గ్రాముల బంగారు ఆభరణాలు, 527.9 గ్రాముల వెండి వస్తువులు, రూ.29,875 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు చోరీ కేసుల దర్యాప్తులో ఈ కీలక పురోగతి సాధించినట్లు పోలీసులు తెలిపారు. వరుస చోరీల నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టారు. గతంలో జరిగిన చోరీల తీరును విశ్లేషించి అనుమానితుల కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు సోమవారం ఉదయం ఒక వ్యక్తిని అదుపులోకి




తీసుకుని విచారించారు. విచారణలో మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు చోరీలకు సంబంధించిన కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం ఆశిష్ శ్రీనివాస్ రెడ్డిమల్ల (27) పెద్దపల్లి జిల్లాకు చెందినవాడు. ప్రస్తుతం మహారాష్ట్ర రాష్ట్రంలోని చంద్రపూర్‌లో నివసిస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు ప్రాథమిక విచారణలో అంగీకరించినట్లు తెలిపారు. పగటి సమయంలో ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి, రాత్రివేళల్లో చోరీలకు పాల్పడటం అతని నేర పద్ధతిగా పోలీసులు గుర్తించారు. నిందితుడిని వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద మిల్స్ కాలనీ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి చోరీ చేసిన బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శివనగర్, ఎస్ఆర్ఆర్ నగర్ ప్రాంతాల్లో జరిగిన పలు ఇంటి చోరీలలో నిందితుడి ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు వెల్లడించారు.
నిందితుడికి గతంలో కూడా నేర చరిత్ర ఉన్నట్లు విచారణలో బయటపడింది. 2024, 2025 సంవత్సరాల్లో మహారాష్ట్రలో నాలుగు చోరీ కేసుల్లో అరెస్టై జైలుకు వెళ్లిన అతడు, అనంతరం బెయిల్‌పై విడుదలయ్యాడు. అయితే విడుదలైన తర్వాత కూడా నేరాలకు పాల్పడుతూ తిరిగి చోరీల బాట పట్టినట్లు పోలీసులు గుర్తించారు. అంతర్రాష్ట్ర స్థాయిలో నేరాలకు పాల్పడుతున్న నిందితుడిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ స్వామి, ఎస్ఐ మహేష్, ఏఏఓ సల్మాన్ పాషా, సీసీఎస్ మరియు మిల్స్ కాలనీ పోలీసు సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత అభినందించారు. ప్రజలు తమ ఇళ్ల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు.

## వేములవాడలో లాడ్జీలపై ఆకస్మిక తనిఖీలు



- భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి
- సీసీ కెమెరాల పనితీరు పరిశీలన
- అనుమానితుల సమాచారంపై అప్రమత్తం

**వేములవాడ, ఆగస్టు 24 (మన విశ్వం):** వేములవాడ పట్టణంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేసే దిశగా పోలీసులు సోమ వారం లాడ్జీలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహి ంచారు. పట్టణంలోని వివిధ వసతి గృహాలను సందర్శించిన పోలీసులు బసకు వచ్చిన అతిథుల వివరాలు, నమోదు ప్రక్రియ, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. నేర నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెంచే లక్ష్యంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల సందర్భంగా లాడ్జీలలో నిర్వహిస్తున్న అతిథుల రిజిస్టర్లను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. బసకు వచ్చే ప్రతి వ్యక్తి పూర్తి వివరాలను నమోదు చేస్తున్నారా లేదా అన్న అంశంపై ఆరా తీశారు. ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా పరిశీలించి, సంబంధిత వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు.
లాడ్జీలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును కూడా పోలీసులు తనిఖీ చేశారు. కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, రికార్డింగ్ వ్యవస్థలో ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలని నిర్వాహకులకు సూ చనలు ఇచ్చారు. భద్రతా పరంగా సీసీ కెమె రాలు కీలక పాత్ర పోషిస్తాయని, వాటి నిర్వ హణలో నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. పట్టణానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యక్తుల వివరాల నమోదు విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. ఎలాంటి అనుమానాస్పద పరిస్థి తులు కనిపించినా లేదా అనుమానాస్పద వ్యక్తులు లాడ్జీలలో బస చేసినట్లు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భద్రతకు సహకరించే విధంగా నిర్వాహకులు వ్యవహరించాలని కోరారు. ప్రస్తుతం పండుగలు, ప్రత్యేక కార్యక్రమాలు, యాత్రల నేపథ్యంలో వేములవాడకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, సందర్శకులు అధిక సంఖ్యలో వస్తున్నారని పోలీసులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయడం అవసరమని పేర్కొన్నారు. వసతి గృహాల నిర్వా హకులు పోలీసు శాఖ సూచనలను తప్ప నిసరిగా పాటించాలని సూచించారు. నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా ఇలాంటి తనిఖీలు కొనసా గుతాయని పోలీసులు స్పష్టం చేశారు. లాడ్జీల నిర్వహణలో నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భద్రతా ప్రమాణాల అమలులో నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని కోరారు.

# సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు?

- నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి
- పెండింగ్ భూసేకరణ వేగవంతం
- ప్రాజెక్టుల పూర్తి లక్ష్యంగా చర్యలు
- ప్రజాప్రతినిధులతో సీఎం సమీక్ష

**హైదరాబాద్, ఆగస్టు 24 (మన విశ్వం):** రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధులకు తెలిపారు. బ్రిటన్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలు, నియోజకవర్గాల పురోగతి, సాగునీటి ప్రాజెక్టుల అమలు తదితర అంశాలపై ఈ సందర్భంగా సమీక్ష చేపట్టారు. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులందరూ తమ తమ నియోజకవర్గాల అభివృద్ధిపై మరింత దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ముఖ్యంగా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు దీర్ఘకాల ప్రయోజనం చేకూర్చే ప్రాజెక్టుల అమలులో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులకు సూచించారు.
భూసేకరణ ప్రక్రియలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ప్రాజెక్టులు పూర్తికావడంలో తీవ్ర జాప్యం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. భూసేకరణ, పునరావాసం మరియు పునరుద్ధరణ కార్యక్రమాలు, అటవీ అనుమతులకు సంబంధించిన



అంశాలను ప్రాధాన్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలకు అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సాగునీటి రంగ అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని పేర్కొన్న ముఖ్యమంత్రి, రైతులకు స్థిరమైన నీటి వనరులు అందించేందుకు వివిధ ప్రాజెక్టుల పనులను వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాజెక్టుల అమలులో ఉన్న అడ్డంకులను గుర్తించి వాటిని తొలగించేందుకు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అయితేనే ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనాలు అందుతాయని తెలిపారు.
ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య, వేముల వీరేశం పాల్గొన్నారు. అలాగే ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, కడియం కావ్య, రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హాజరయ్యారు. అదేవిధంగా పలువురు ఎమ్మెల్యేలు కూడా సమావేశంలో పాల్గొని తమ నియోజకవర్గాల అభివృద్ధి అవసరాలు, పెండింగ్ ప్రాజెక్టుల పురోగతి, ప్రజా సమస్యలపై ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రాజెక్టుల పూర్తి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

# లే అవుట్ల అనుమతుల్లో నిబంధనలకే ప్రాధాన్యం

- కలెక్టర్ ప్రియాంక ఆదేశాలతో కఠిన పరిశీలన
- ఆన్‌లైన్ విధానంతో వేగవంతమైన ప్రక్రియ
- మూడు లే అవుట్లకు అనుమతి
- పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు



**నారాయణపేట, ఆగస్టు 24 (మన విశ్వం):** ప్రభుత్వ నిబంధనలను పూర్తిస్థాయిలో అనుసరించి మాత్రమే లే అవుట్లకు అనుమతులు మంజూరు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ప్రియాంక స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా లే అవుట్ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. లే అవుట్ల అనుమతుల జారీ ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సంబంధించిన ఆరు లే అవుట్ దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా సంబంధిత శాఖల నుంచి వచ్చిన క్లియరెన్స్ వివరాలను కలెక్టర్ సమీక్షించారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మూడు లే అవుట్లకు అనుమతులు మంజూరు చేయగా, నిబంధనలకు అనుగుణంగా లేని మరో మూడు దరఖాస్తులను తిరస్కరించినట్లు వెల్లడించారు.లే అవుట్ అనుమతుల జారీ ప్రక్రియలో ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టడం వెనుక ఉన్న ఉద్దేశాన్ని కలెక్టర్ వివరించారు. దరఖాస్తుల పరిశీలనను సులభతరం చేయడం, సమయాన్ని ఆదా చేయడం, అనవసరమైన భౌతిక సమావేశాలను తగ్గించడం కోసం ఈ విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు ఆన్‌లైన్‌లోనే తమ అభిప్రాయాలు, క్లియరెన్స్‌లు నమోదు చేయడం వల్ల ప్రక్రియ మరింత పారదర్శకంగా మారుతుందని చెప్పారు. ఆన్‌లైన్ పరిశీలన సమయంలో ఏదైనా అధికారి లేదా కమిటీ సభ్యుడు అభ్యంతరం వ్యక్తం చేస్తే, దానిని వ్యవస్థలోనే నమోదు చేసే విధానం ఉండాలని కలెక్టర్ సూచించారు. అభ్యంతరాలు లేని దరఖాస్తులను నేరుగా తదుపరి దశకు పంపించే విధానాన్ని అమలు చేస్తే సమయం, శ్రమ రెండూ ఆదా అవుతాయని పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉన్న దరఖాస్తులను మాత్రమే భౌతిక సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవడం మరింత సమర్థవంతమైన విధానమని అభిప్రాయపడ్డారు.

లే అవుట్ల అనుమతుల విషయంలో అధికారులు అన్ని నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి లోపాలకు తావు లేకుండా దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశించారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచి అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి లే అవుట్‌లో రహదారుల ఇరువైపులా మొక్కలు నాటే నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడంలో ఈ చర్యలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. లే అవుట్ల అభివృద్ధితో పాటు పర్యావరణ సమతుల్యతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు.

# గిరిజన హక్కులు, అటవీ సంరక్షణకు ప్రాధాన్యం

- జాటోత్ హుస్సేన్ క్షేత్రస్థాయి పరిశీలన
- అంబాసత్రం భూమిపై 15 రోజుల్లో స్పష్టత
- కూనారం భూ వివాదంపై ప్రజాభిప్రాయ సేకరణ
- సమన్వయంతో సమస్యల పరిష్కారానికి చర్యలు



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 24 (మన విశ్వం):** గిరిజనుల హక్కులను పరిరక్షిస్తూ అటవీ సంరక్షణకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ సూచించారు. కూనారం గ్రామంలో అటవీ, రెవెన్యూ భూములకు సంబంధించిన సమస్యలపై ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి గిరిజనులు, గ్రామస్థులు, రెవెన్యూ, అటవీ, సర్వే శాఖల అధికారులతో ప్రజా వినతుల సమావేశం నిర్వహించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా సమగ్ర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పాత సర్వే రికార్డులు, జాయింట్ సర్వే నివేదికలు, రెవెన్యూ--అటవీ శాఖల పత్రాలను సమగ్రంగా పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని జాటోత్ హుస్సేన్ సూచించారు. గతంలో 250 ఎకరాలకు పైగా ఉన్నట్లు నమోదైన అంబాసత్రం భూమిని గుర్తించి, ఓవర్‌ల్యాప్ ప్రాంతాలను మరోసారి సర్వే చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ ప్రక్రియ ద్వారా 15 రోజుల్లో ప్రాథమిక స్పష్టత తీసుకురావాలని పేర్కొన్నారు. జాయింట్ సర్వే ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సంబంధిత వ్యక్తుల సంతకాలు, వాంగ్మూలాలు, ఆధారాలను నమోదు చేసి భవిష్యత్ వివాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజనుల జీవనోపాధి, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూనే అటవీ సంపదను కాపాడే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ కూనారం సమస్యకు సంబంధించిన పాత, తాజా సర్వేలు, మ్యాపులు, రెవెన్యూ--అటవీ రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి తుది నివేదిక సిద్ధం చేస్తామని తెలిపారు. దమ్మపేట, కరకగూడెం, అశ్వారావుపేట ప్రాంతాల్లో కూడా ఇలాంటి భూ సమస్యలపై జాయింట్ సర్వేలు కొనసాగుతున్నాయని, వచ్చే ఆరు నుంచి ఏడు నెలల్లో స్పష్టత వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 60 శాతం అటవీ ప్రాంతం ఉందన్నారు. 2.10 లక్షల ఎకరాలకు పైగా పోడు భూములకు హక్కులు కల్పించడంతో పాటు సుమారు 13 వేల మంది గిరిజనులకు బోర్‌వెల్ సౌకర్యం అందించినట్లు తెలిపారు. అటవీ హక్కుల చట్టం అమలులో భాగంగా అర్హులైన గిరిజనులకు న్యాయం జరిగేలా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ కూనారం భూ సమస్య ఐదు నుంచి ఆరు సంవత్సరాలుగా కొనసాగుతోందన్నారు. భూమి రెవెన్యూ లేదా అటవీ పరిధిలోకి వస్తుందో సమగ్రంగా నిర్ధారించి అర్హులైన గిరిజనులకు న్యాయం జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు. ఈ ప్రజా వినతుల సమావేశంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, వివిధ శాఖల అధికారులు, సర్వేయర్లు, గిరిజనులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ప్రారంభం

- విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ
- పాఠశాలలో కొత్త సౌకర్యాల ప్రారంభం
- విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యం
- కప్పర పాఠశాలలో కలెక్టర్ పర్యటన



**ఆదిలాబాద్, ఆగస్టు 24 (మన విశ్వం):** తాంసి మండలం కప్పర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమైన కలెక్టర్ విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులను కలెక్టర్ పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ గదిని కలెక్టర్ ప్రారంభించారు. డిజిటల్ విద్యకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంప్యూటర్ విద్య ద్వారా భవిష్యత్తు అవకాశాలను మరింత విస్తరించుకోవచ్చని పేర్కొన్నారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను కూడా ప్రారంభించారు. విద్యార్థుల్లో ప్రకృతి పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు పౌష్టికాహార ప్రాధాన్యాన్ని తెలియజేయడంలో ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో విద్యాభ్యాసం జరగాల్సిన అవసరాన్ని వివరించారు.అదే విధంగా పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండడం విద్యా ప్రమాణాల మెరుగుదలకు దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధిలో గ్రామస్థులు, ఉపాధ్యాయులు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, డీఆర్‌డీఓ రవీందర్, పంచాయతీరాజ్ ఈఈ శివరాం, తహసీల్దార్ గణేష్, ఎంపీడీఓ గడ్డం మోహన్ రెడ్డి, ఎంఈఓ శ్రీకాంత్, సర్పంచ్ గండ్రత్ అరుణ్, ఎంపీఓ అవినాష్, ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, ఆత్మ చైర్మన్ నారాయణ, ఏఎంసీ చైర్మన్ ఇందిరా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తాడిచర్ల తహసీల్దార్‌కు ఘన సన్మానం



- ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయం అవసరం

**మల్హార్,ఆగస్టు 24(మన విశ్వం):** మల్హార్ మండల తహసీల్దార్ రవికుమార్‌ను జాతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధులు సోమవారం ఘనంగా సన్మానించారు.ఎన్ హెచ్ ఆర్ సిఎన్జీవో వ్యవస్థాపక అధ్యక్షుడు ఐలినేని శ్రీనివాసరావు సూచనల మేరకు మల్హార్ మండల కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.కౌన్సిల్ ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగపురి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో తాడిచర్ల మండల అధ్యక్షుడు కరుపాకల ప్రశాంత్, ఉపాధ్యక్షుడు రాళ్లబండి ప్రశాంత్‌లు తహసీల్దార్ కార్యాలయంలో రవికుమార్‌ను శాలువాతో సత్కరించి, గౌరవించారు.ఈ సందర్భంగా నాగపురి శ్రీకాంత్ గౌడ్ కరుపాకల ప్రశాంత్ మాట్లాడుతూ.. మండలంలో సుదీర్ఘకాలంగా నెలకొన్న పలు ప్రజా సమస్యలను ఈ సందర్భంగా తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి, వాటిపై చర్చించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యల త్వరితగతిన పరిష్కారం కావాలంటే ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు పరస్పర సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన కోరారు. ప్రజా రక్షణ, హక్కుల సాధనలో కౌన్సిల్ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో కౌన్సిల్ ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహార అల్పాహారమే ప్రభుత్వ లక్ష్యం

- పిల్లల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి
- సింగరేణి నిధులతో ఆధునిక వంటశాల
- మంథనిలో కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం



**మంథని, ఆగస్టు 24 (మన విశ్వం):** పిల్లలు ఆకలితో పాఠశాలకు వెళ్లే పరిస్థితి రాష్ట్రంలో ఉండకూడదని, ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, శారీరక ఎదుగుదల, చదువుపై ఏకాగ్రత పెంపునకు అల్పాహార పథకం కీలకమని పేర్కొన్నారు. సోమవారం మంథనిలో సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి ప్రారంభించారు. సుమారు రూ.7.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ ఆధునిక కమ్యూనిటీ కిచెన్ ద్వారా వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించే అవకాశం కలుగుతుందని మంత్రి తెలిపారు. గంటకు 10 వేల ఇడ్లీలు, 3 వేల దోసెలు, 5,600 పూరీలు తయారు చేసే సామర్థ్యంతో ఈ కేంద్రాన్ని రూపొందించినట్లు వివరించారు. ప్రారంభ కార్యక్రమం అనంతరం కిచెన్‌లో తయారు చేసిన అల్పాహారాన్ని విద్యార్థులతో కలిసి మంత్రి స్వీకరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. 2011లో ఆసుపత్రుల్లో రోగుల సహాయకులకు ఆహారం అందించే కార్యక్రమంగా ప్రారంభమైన ఈ సేవలు ప్రస్తుతం విస్తృత స్థాయిలో కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రజలకు ఆహార భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం కూడా పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాద ప్రతిపాదించిన "పది మైళ్ల పరిధిలో ఎవరూ ఆకలితో ఉండకూడదు" అనే సందేశం ప్రభుత్వానికి స్ఫూర్తిగా నిలిచిందని శ్రీధర్ బాబు తెలిపారు. సమాజంలో ఆకలి నిర్మూలనకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు పోషకాహార భద్రత కల్పించడం ద్వారా భవిష్యత్ తరాలను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో విద్యాశాఖకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మార్గదర్శకత్వంలో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సంక్షేమం కోసం వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అధ్యయనాల ప్రకారం విద్యాశాఖ కార్యక్రమాల అమలులో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో సురేష్, మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న, మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఆర్జీ–3 జీఎం, తహసీల్దార్ ఆరిపొద్దిన్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కమ్యూనిటీ కిచెన్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం కల్పించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

# రామతీర్థంలో స్మార్ట్ కార్డుల పంపిణీ




**నల్లబెల్లి, ఆగస్టు 24(మన విశ్వం):** రామతీర్థం గ్రామంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రివర్యులు ప్రవేశపెట్టిన స్మార్ట్ కార్డులను గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్థులకు పంపిణీ చేశారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభంగా, పారదర్శకంగా అందించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన స్మార్ట్ కార్డుల ప్రాధాన్యతను ఈ సందర్భంగా నాయకులు వివరించారు.

గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామస్థులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్మార్ట్ కార్డుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించే వివిధ సేవలను మరింత సులభంగా పొందే అవకాశం ఉంటుందని నాయకులు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ స్మార్ట్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాలోత్ చరణ్ సింగ్, సొసైటీ డైరెక్టర్ శివాజీ, మైనాల అశోక్, బత్తిని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటి ప్రయోజనాలు ప్రతి కుటుంబానికి చేరేలా స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు.

కార్యక్రమం సందర్భంగా స్మార్ట్ కార్డులను అందుకున్న గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని నాయకులు పేర్కొన్నారు. సమావేశం అనంతరం స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.

# కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ నివేదిక కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

- కేంద్ర సంస్థ నివేదికకు ప్రాధాన్యం
- కాంగ్రెస్ పై జీవన్ రెడ్డి విమర్శలు
- ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్



**హైదరాబాద్, ఆగస్టు 24 (మన విశ్వం):** కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల అంశం మరోసారి రాజకీయ వేడిని రాజేసింది. కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ సమర్పించిన నివేదిక నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ విమర్శల దాడిని ముమ్మరం చేసింది. ఈ నివేదికలో మూడు బ్యారేజీలను వినియోగించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారని బీఆర్ఎస్ నేతలు చెబుతుండగా, ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది.

ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టీ. జీవన్ రెడ్డి స్పందిస్తూ, కేంద్ర సంస్థ నివేదిక కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులా మారిందని వ్యాఖ్యానించారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై అధికార పార్టీ ఇప్పటివరకు చేసిన ఆరోపణలు, విమర్శలు ఈ నివేదికతో బలహీనపడ్డాయని అన్నారు. ప్రాజెక్టుపై ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు.

టీ. జీవన్ రెడ్డి మాట్లాడుతూ, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను వాడుకోవచ్చని కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ స్పష్టంగా చెప్పిందన్నారు. అలాంటి పరిస్థితిలో ప్రాజెక్టుపై ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరి ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాజకీయాలు చేయకుండా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. నివేదిక వెలుగులోకి వచ్చిన తర్వాత నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించలేని పరిస్థితి ఏర్పడిందని జీవన్ రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, చేసిన ప్రకటనలపై ఇప్పుడు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉందన్నారు. కేంద్ర సంస్థ అభిప్రాయాలను ప్రభుత్వం గౌరవించి తదుపరి కార్యాచరణను ప్రకటించాలని కోరారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా జీవన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రజా సమస్యలు అనేకం ఉన్న సమయంలో ఫుట్‌బాల్ కార్యక్రమం పేరుతో భారీగా ప్రజాధనం ఖర్చు చేశారని ఆరోపించారు. రూ.100 కోట్ల మేర నిధులను ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించి ఉంటే ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరేదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ వ్యవసాయ, సాగునీటి రంగాలకు కీలకమని బీఆర్ఎస్ నేతలు పునరుద్ఘాటిస్తున్నారు. కేంద్ర సంస్థ నివేదికను పూర్తి స్థాయిలో ప్రజలకు వెల్లడించి, బ్యారేజీల వినియోగంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వ్యవహరించాలని, ప్రాజెక్టుకు సంబంధించిన అంశాల్లో పారదర్శకత పాటించాలని బీఆర్ఎస్ నాయకులు కోరుతున్నారు.

# మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై నివేదిక సిద్ధం చేసిన క్రమశిక్షణ కమిటీ

హైదరాబాద్, ఆగస్టు 24 : తెలంగాణ మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై క్రమశిక్షణ కమిటీ నివేదిక సిద్ధం చేసింది. ఈ నివేదికను తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు ఈకమిటీ ఇవ్వనుంది. ఈ క్రమంలోనే కొండా సురేఖపై చర్యలకు రంగం సిద్ధమైనట్లు సమాచారం.కొండా సురేఖతో పాటు మరో ఇద్దరి వ్యవహారంపై కఠిన నిర్ణయం తీసుకునేలా క్రమశిక్షణ కమిటీ సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. (సోమవారం) సాయంత్రం ఈ నివేదికను ఏఐసీసీకి మహేశ్ గౌడ్ పంపనున్నారు. కొండా సురేఖ వివరణకు క్రమశిక్షణ కమిటీ సంతృప్తి వ్యక్తం చేయలేదని సమాచారం.ఆమెపై చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణ కమిటీ సిఫారసు చేసింది. సీఎం



రేవంత్‌రెడ్డిపై సురేఖ కూతురు సుస్మిత ఆరోపణలు చేస్తే సహజ న్యాయ సూత్రం ప్రకారం సురేఖ ఖండించాల్సిందని ఈ కమిటీ అభిప్రాయపడింది. సీఎం, ప్రభుత్వం, పార్టీపై ఎవరు తప్పుడు మాటలు మాట్లాడినా చర్యలు ఉండాల్సిందేనన్న కమిటీ స్పష్టం చేసింది. గతంలో కొండా సురేఖను కాపాడానని, ఇక తానేమీ చేయలేనని మహేశ్ గౌడ్ స్పష్టం చేసిన విషయం తెలిసిందేసీఎం రేవంత్‌రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. రాష్ట్రంలోని తాజా పరిణామాలపై ఇరువురు నేతలు చర్చిస్తున్నారు. ఇటీవల భట్టితో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి భేటీ అయ్యారు. కొండా సురేఖ అంశంపై సీఎంరేవంత్,భట్టిచర్చించనున్నట్లు సమాచారం.

## ఏపీ లిక్కర్ స్కాం.. కారుమూరికి వైద్య పరీక్షలు పూర్తి

హైదరాబాద్, ఆగస్టు 24 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో జరిగిన మద్యం రవాణా కాంట్రాక్టుల్లో అక్రమాలకు సంబంధించి వైసీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కొండాపూర్‌లోని ఆయన నివాసంలో (ఆదివారం) ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో కారుమూరికి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో (సోమవారం) వైద్య పరీక్షలు పూర్తి చేశారు. అనంతరం కారుమూరిని నాంపల్లి కోర్టులో హాజరుపరచనున్నారు. ఇదే కేసులో ఇప్పటికే కారుమూరి కుమారుడు సునీల్‌ను అరెస్ట్ చేశారు.నా అకౌంట్‌లో ఎలాంటి డబ్బులు జమ అవ్వలేదు: కారుమూరిగాంధీ ఆసుపత్రి వద్ద మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. తన అకౌంట్‌లో ఎలాంటి డబ్బులు జమ అవ్వలేదని తెలిపారు. ఈ



కేసులో తన కొడుకును అరెస్టు చేశారని, ఇప్పుడు తనను అరెస్టు చేశారని వెల్లడించారు. తన కుటుంబాన్ని మొత్తం అరెస్ట్ చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. తనకు ఏ కన్‌స్ట్రక్షన్ కంపెనీ తెలియదని చెప్పుకొచ్చారు.తనకు ఏ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నుంచి ఎలాంటి డబ్బులు చేరలేదని ఆయన అన్నారు. సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ నుంచి తనకు డబ్బులు చేరాయన్నమాట అవాస్త వమని చెప్పారు. సుదర్శన్ కన్‌స్ట్రక్షన్‌లో జరిగే వ్యవహారాలు తనకెలా తెలుస్తాయని ప్రశ్నించారు. ఈ కేసులో నిజా నిజాలన్నీ కోర్టులో తేలుతాయని కారుమూరి వెంకట నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ కోదాడ నుండి వెళ్లాల్సిందే

కోదాడ, ఆగస్టు 24 : కోదాడ మీదుగా హైదరాబాద్.. అమరావతి.. చెన్నై ప్రతిపాదిత హై స్పీడ్ బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ కొనసాగాలి, తొలుత ప్రతిపాదన ప్రకారమే కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకోవాలని.. ఎట్టి పరిస్థితిలోనూ చౌటుప్పల్- సూర్యాపేట- కోదాడ మీదుగా బుల్లెట్ ట్రైన్ వెళ్లాల్సిందేనని అఖిలపక్ష నేతలు స్పష్టం చేశారు. సోమవారం కోదాడ పబ్లిక్ క్లబ్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన సామూహిక సన్నాహక సమావేశంలో ఈ మేరకు వారు తమ నిర్ణయం వెలువరించారు. సమావేశం ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భావితరాల ప్రయోజనాల కోసం హైదరాబాద్ నుండి సూర్యాపేట కోదాడ మీదుగా రైల్వే లైన్ అవసరమన్నారు. 65వ జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీతో ప్రమాదాలు సంభవించి వందల మంది ప్రాణాలు కోల్పోయారని, ట్రైన్ సౌకర్యంతో ఈ ఇబ్బంది తొలగుతుందని, దీంతోపాటు పారిశ్రామికంగా వ్యాపార, వర్తక, వాణిజ్య, వైద్య రంగాలు అభివృద్ధి చెందేందుకు రైల్వే లైన్ ఉపకరిస్తుందన్నారు. దినదినం అభివృద్ధి చెందుతున్న కోదాడ నుండి రైలు రాకపోకలు అవసరమన్నారు. ఇక్కడి ప్రజల ఉన్నత భవిష్యత్ కోసం రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఇది కోదాడ ప్రాంత ప్రజల అభిప్రాయం తెలిపారు.బుల్లెట్ ట్రైన్ సాధన కోసం కలిసి వస్తున్న రాజకీయ పార్టీలను, నాయకులకు, వ్యాపార, ఉద్యోగ, స్వచ్ఛంద సంస్థల బాధ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రజా చైతన్య వేదిక కన్వీనర్ రాయపూడి చిన్ని, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, బిజెపి, ఎమ్మార్పీఎస్ నాయకులు ములకలపల్లి రాములు, బెజవాడ వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాస్, వెంపటి వెంకటేశ్వరరావు, చింతలపాటి శ్రీనివాసరావు, కనగాల నారాయణ, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఏపూరి రాజు మాట్లాడుతూ.. ట్రైన్ సాధనకు దశల వారి ఉద్యమాలు నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉన్నామన్నారు. రాబోయే తరాలకు ఉపాధి పరిశ్రమలు, వ్యాపార రంగాల అభివృద్ధికి రైలు సౌకర్యం అవసరమన్నారు. ఐక్య ఉద్యమాలతోనే సాధ్యమని సమిష్టిగా కలిసి వస్తామని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు సత్య బాబు, పిల్లుట్ల శ్రీనివాస్, కరీముల్లా, బాబా, ముత్యాలు, హుస్సేన్, రామ నరసయ్య, కోటయ్య, నరసింహారావు, ఉద్యోగ, ఉపాధ్యాయ, స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాల బాధ్యులు, పట్టణ పౌరులు పాల్గొన్నారు.




# ఆధారాలు చెరిపేయలేరు - కోర్టులను ఏమార్చలేరు! : తెలంగాణలో 'ఈ సాక్ష్య' అమలుకు సన్నాహాలు

హైదరాబాద్, ఆగస్టు 24 :సాధారణంగా ఏదైనా నేరం జరిగినప్పుడు దర్యాప్తులో భాగంగా అధికారి నేరం జరిగిన స్థలానికి వెళ్లి వివరాలు సేకరిస్తారు. ప్రాథమిక సాక్ష్యాధారాలతో పాటు నేరస్థలంలోని తీరుతెన్నులను సాక్షుల సమక్షంలోనే నమోదు చేస్తారు. ప్రాథమిక దర్యాప్తు సమాచారంతో ఎఫ్ఐఆర్‌ను పూర్తి చేస్తారు. సంబంధిత పత్రాలను కోర్టులో సమర్పిస్తారు. ఈ-సాక్ష్య ప్రక్రియలో : ఏదైనా నేరం జరిగినప్పుడు పోలీస్ అధికారి నేరం జరిగిన స్థలానికి వెళతారు. సాక్ష్యాధారాలతో పాటు నేరస్థలం తీరుతెన్నులను వీడియో తీస్తారు. అక్కడి నుంచే నేరుగా కోర్టుకు చేరేలా వీడియోను అప్‌లోడ్ చేస్తారు.ఆధునిక టెక్నాలజీ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ నేర దర్యాప్తు ప్రక్రియను సులభతరం చేసేందుకు ఉద్దేశించిన ఈ-సాక్ష్య విధానం త్వరలో తెలంగాణలో అమలు కానుంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) అమల్లో భాగంగా నేర స్థల పరిశోధనతో పాటు సాక్ష్యాధారాలను భద్రపరిచేందుకు కేంద్ర హోంశాఖ ఈ డిజిటల్ వ్యవస్థను తయారు చేసింది. ఈ వ్యవస్థ ద్వారా దర్యాప్తు అధికారులు నేర స్థలంలో ఫొటోలు, వీడియోలు తీయడంతో పాటు సాక్షుల వాంగ్మూలాలను రియల్-టైంలో డిజిటల్‌గా రికార్డు చేసి సురక్షితంగా భద్రపరిచేందుకు



అవకాశం ఏర్పడనుంది. రాష్ట్రంలో ఎంపిక చేసిన కొన్ని పోలీస్? స్టేషన్లలో ఇప్పటికే ఈ విధానాన్ని అమలు చేస్తుండగా, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా తీసుకు రావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా దర్యాప్తు అధికారులకు 'ఈ-సాక్ష్య' యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నారు.ఏమీ మార్చలేరు, ఏమార్చనూ లేరు : ఈ సరికొత్త విధానంలో నేరం జరిగిన ప్రాంతానికి వెళ్లే దర్యాప్తు అధికారి అక్కణ్నుంచే సాక్ష్యాలు, పంచనామా, ఆధారాలు నిర్వహించే వారి వాంగ్మూలాలు, నేర స్థలి తీరుతెన్నులను వీడియో రూపంలో భద్ర పరిచి అక్కణ్నుంచే అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలన్నీ కోర్టులో డిజిటల్ ఆధారాలుగా నిక్షిప్తం అవుతాయి. అదే సమయంలో సంప్రదాయ కాగితపు పత్రాలతో సమానమైన చట్టపరమైన చెల్లుబాటుతో కూడిన భారతీయ సాక్ష్య అభియాన్ (బీఎస్ఏ) చట్టం సెక్షన్ 61 ధృవపత్రం కూడా అప్పటికప్పుడే జారీ అవుతుంది.ఈ సాక్ష్యాధారాలను కోర్టు పరిగణనలోకి తీసుకోగలుగుతుంది. దీనికితోడు నేరం జరిగిన వెంటనే సేకరించే సాక్ష్యాధారాలు న్యాయస్థానంలో భద్రపరచడానికి వీలు కావడంతోపాటు భవిష్యత్తులో ఏమార్చడానికి వీల్లేకుండా తిరుగులేని సాక్ష్యాలుగానూ ఈ ఆధారాలు నిలుస్తాయి. నేర స్థలంలో జరిగే తనిఖీలను లైవ్‌లో రికార్డు చేయడం, రికార్డు చేసిన సమాచారానికి టైమ్‌స్టాంప్(సమయం) కేటాయించడంతోపాటు సురక్షితంగా ఉంచడం సాక్షుల వాంగ్మూలాలను డిజిటల్ రూపంలో రియల్‌టైంలో నమోదు చేయడం లాంటివి ఇందులో పకడ్బందీగా భాగమైపోతాయి.ఐసీజేఎస్‌తో కీలక వ్యవస్థల అనుసంధానం : ఆధునిక టెక్నాలజీ పరిజ్ఞానంతో నేర న్యాయ వ్యవస్థ పనితీరును సులభతరం చేసేందుకు కొంతకాలం క్రితమే ఇంటర్ ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్(ఐసీజేఎస్)ను అందుబాటులోకి తెచ్చారు. ఇందులో భాగంగానే నేర న్యాయవ్యవస్థలోని ప్రధాన డిపార్ట్?మెంట్?లను అనుసంధానించే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే 5 ప్రధాన విభాగాల్లో ఒక విభాగం నమోదు చేసిన సమాచారాన్ని మళ్లీ వేరే చోట నమోదు చేయాల్సిన అవసరమే ఉండదు. ఒకసారి డేటాను నమోదు చేస్తే చాలు అన్ని విభాగాలు చూడగలిగే వీలు కలగనుంది.న్యాయ వ్యవస్థలోనూ పారదర్శకత, కెపాసిటీ మరింతగా పెరగనుంది. ఉదాహరణకు పోలీసులు నేర స్థలిలో సేకరించిన ఆధారాలను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ(ఎఫ్ఎస్ఎల్)లో అనాలసిస్? వస్తే ఆ సమాచారం ఆన్‌లైన్‌లోనే ఇ-ఫోరెన్సిక్‌కు చేరిపోయి విశ్లేషణ వేగంగా పూర్తవుతుంది. అలాగే నిందితుల రిమాండ్ సమాచారం వేగంగా జైళ్లకు చేరుతుంది. ఇలా దాదాపు అన్ని దశల్లోని ప్రక్రియలన్నీ ఆన్‌లైన్‌లోనే పూర్తయిపోవడం ద్వారా ఖర్చుతో పాటు సమయం కూడా ఆదా కావడంతోపాటు తదుపరి దశల్లో ఆధారాలను చెరిపేసే, మార్చే అవకాశం ఉండదని పోలీస్ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

# నీటి పంపిణీపై నిర్ణయం తీసుకోకుండానే వాయిదా పడ్డ కేఆర్ఎంబీ సమావేశం

హైదరాబాద్: జలసౌధలో కృష్ణానదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే వాయిదా పడింది. కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. భేటీకి తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు, ఏపీ ఈఎన్సీ నరసింహమూర్తి హాజరయ్యారు.నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి పంపిణీపై ఈ భేటీలో చర్చలు జరిపారు. రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకుగానూ నీటి విడుదలపై చర్చించేందుకు త్రిసభ్య కమిటీని సమావేశ పర్చారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా బోర్డుకు ముందే లేఖ రాసింది.తొలుత ఈ నెల 13న సమావేశం అయ్యేందుకు తేదీని ఖరారు చేశారు. తర్వాత 17కు వాయిదా పడింది. ఆ సమయంలో ఏపీ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మరోసారి వాయిదా పడింది. దీంతో నేడు ఈ భేటీని నిర్వహించారు. శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు, రెండు రాష్ట్రాల




అవసరాలపై చర్చించారు. అయితే ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా సెప్టెంబర్ 4కు మరో సారి భేటీ కావాలని నిర్ణయించారు.50:50 నిష్పత్తిలో వాడుకోవాలి : సాగర్, శ్రీశైలం నీటి వాటాలపై చర్చించామని తెలంగాణ ఈఎన్సీ రఘువర్ధన్ తెలిపారు. ఎల్‌నినో దృష్ట్యా తాగునీటికే వాడుకోవాలని త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకుందని అన్నారు. తాగునీటికి 50:50 నిష్పత్తిలో వాడుకోవాలని చెప్పామని, పోతిరెడ్డిపాడు నుంచి ఎక్కువ నీరు వాడుకుంటున్నారని ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు." నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులలో నీటి వాటాలపై చర్చ జరిగింది. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా త్రాగునీటి కోసం మాత్రమే నీటిని వాడుకోవాలని త్రిసభ్య కమిటీలో నిర్ణయించారు. తాగునీటి కోసం 50:50 నిష్పత్తిలో వాడుకోవాలని చెప్పాం. ఏపీ పోతిరెడ్డి పాటు నుంచి ఎక్కువ నీరు వాడుకొందని ఫిర్యాదు చేశాం. సెప్టెంబర్ 4వ తేదీన తాగునీటి అవసరాలపై మాత్రమే చర్చ ఉంటుంది. భవిష్యత్‌లో ప్రవాహాలు వస్తే తదుపరి ఆలోచిస్తాం" – రఘువర్ధన్, తెలంగాణ ఈఎన్సీసెప్టెంబర్ నాలుగో తేదీన చర్చిస్తాం : ఎల్ నినో పరిస్థితుల్లో తాగునీటి కోసమే ఉపయోగించుకోవాలని సూత్రప్రాయ నిర్ణయం జరిగిందని ఏపీ ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి తెలిపారు. రెండు రాష్ట్రాల వాటా అంశం చర్చకు రాలేదని, సెప్టెంబర్ నాలుగో తేదీన మళ్లీ సమావేశమై చర్చిస్తామని పేర్కొన్నారు.

## ఈగల్ శాఖలో ఇంటి దొంగల బాగోతం.. డ్రగ్స్ పెడ్లర్లతో కలిసి

హైదరాబాద్, ఆగస్టు 24:
డ్రగ్స్ నిర్మూలన కోసం పనిచేసే ఈగల్ శాఖలోనే ఇద్దరు కానిస్టేబుల్స్ డ్రగ్స్ దందాకు పాల్పడటం తీవ్ర కలకలం రేపుతోంది. ఈగల్ ఇంటి దొంగలైన కానిస్టేబుల్ నరహరి, స్వామిలపై అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దాదాపు రూ.50 లక్షలు విలువైన ఎక్టసీ పిల్స్‌ను స్వాధీనం చేసుకున్న కానిస్టేబుల్స్.. దీనికి సంబంధించిన సమాచారాన్ని అధికారులకు ఇవ్వనట్లు తెలుస్తోంది. 50 లక్షల విలువైన ఒక కిలో ఎక్టసీ మాత్రలను అక్రమంగా విక్రయించేందుకు వీరిద్దరూ ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం ఏకంగా డ్రగ్ పెడ్లర్లను సంప్రదించినట్లు సమాచారం.ఒక డ్రగ్ పెడ్లర్‌ను పట్టుకునేందుకు హెచ్‌న్యూ అధికారులు చేపట్టిన ఆపరేషన్‌లో.. కానిస్టేబుళ్లు నరహరి, స్వామిల బాగోతం బట్టబయలైంది. గతంలో వీరిద్దరూ పలు విజయవంతమైన యాంటీ డ్రగ్స్ ఆపరేషన్స్ చేసి అవార్డులు కూడా అందుకున్నారు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న ఈగల్ టీం.. ఇద్దరు కానిస్టేబుళ్లను విధుల నుంచి దూరం పెట్టినట్లు తెలుస్తోంది. నరహరి, స్వామిలపై అంతర్గతంగా విచారణ చేపట్టినట్లు సమాచారం. డ్రగ్స్ పెడ్లర్లతో వీరికి ఉన్న సంబంధాలు, ఎక్టసీ మాత్రలు ఎక్కడి నుంచి వచ్చాయి, ఈగల్ శాఖలో మరెవరైనా ఇందులో భాగస్వాములై ఉన్నారా అనే కోణంలో ఈగల్ అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.




## సారంపల్లి మల్లారెడ్డి మరణంపట్ల బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ సంతాపం

హైదరాబాద్: అఖిలభారత రైతు సంఘం నేత, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి మరణంపట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. సారంపల్లి.. రైతాంగ సమస్యలపై, వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం, తన జీవితకాలం పోరాటం చేసిన నిబద్ధత కలిగిన రైతు ఉద్యమ నాయకుడని కేసీఆర్ కొనియాడారు. సారంపల్లి మరణం భారత రైతాంగ ఉద్యమానికి తీరని లోటని కేసీఆర్ అన్నారు. మల్లారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ప్రార్థించారు. వారి కుటుంబసభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## 75 గజాల్లోపు ఇళ్లు 7 మీటర్లకు మించితే కూల్చివేత తప్పదు

హైదరాబాద్: మై క్యూర్ యాప్, ప్రజావాణిలో చాలా ఫిర్యా దులు వచ్చాయని సీఎంసీ కమిషనర్ సృజన తెలిపారు. సాయంత్రం వరకు అక్రమ నిర్మాణా లను గుర్తించాలని అధికారులను ఆదేశించినట్లు వివరించారు. 75 గజాల్లోపు ఇళ్లు 7 మీటర్లకు మించి ఉండకూడదనన్నారు. సాధారణంగా 75 గజాల్లోపు ఇళ్లకు అనుమతి అక్కర్లేదని స్పష్టం చేశారు. 75 గజాల్లోపు ఇళ్లు 7 మీటర్లకు మించితే తొలగిస్తామని హెచ్చరించారు.నోటీసు లు ఇవ్వనక్కర్లేదు : 75 గజాలు దాటిన ఇళ్లకు కచ్చితంగా అనుమతి తీసుకోవాలని, ఈ 2 విభాగాల్లో నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణం లోని ఇళ్లు తొలగించాలని నిర్ణయించినట్లు సృజన స్పష్టం చేశారు. నోటీసుల ప్రక్రియ చాలా ఆలస్యమవుతుందని, నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణం



లోని ఇళ్లు తొలగిసా_మని హెచ్చరించారు. సాయంత్రం వరకు నిబం ధనలు ఉల్లంఘించిన ఇళ్ల జాబితా రూపొం దిస్తామని, ఇంట్లో నివాసం ఉన్న వారికి మాత్రమే నోటీసులు ఇవ్వాలని, నిర్మాణంలో ఉన్న అక్రమ ఇళ్లకు నోటీసులు ఇవ్వనక్కర్లేదని పేర్కొన్నారు. పార్కులో నిర్మించిన ఇల్లు ఖాళీ చేయాలని మధ్యాహ్నం 2 వరకు గడువు ఇచ్చామని తెలిపారు.అనుమతులిస్తే అధికారు లు బాధ్యులవుతారు : అంజయ్యనగర్ పరిసరాల్లో ఇప్పటికే అక్రమ నిర్మాణాల తొలగించామని, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుం టామని సీఎంసీ కమిషనర్ స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణానికి అనుమతులిస్తే అధికారులు బాధ్యులవుతారని హెచ్చరించారు. చాలా వరకు అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతా యని, అక్రమ నిర్మాణాలు పర్యవేక్షించాల్సిన అధికారులపైనా చర్యలు ఉంటాయాని తెలిపా రు. పూర్తిగా అనుమతులు లేని ముందుగా నిర్మాణాలపై దృష్టిపెట్టామని అన్నారు.అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ విభాగానికి పూర్తి అధికారాలు : అక్రమ నిర్మాణాల పర్యవేక్షణకు టాస్క్‌ఫోర్స్ కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని, హైడ్రా వంటి విభాగాలను అనుమతించాలని తెలిపారు. ఫిర్యాదులకు అనుగుణంగా పర్యవేక్షణకు సిబ్బంది ఉండాలని, పట్టణ ప్రణాళిక విభాగం బలోపేతంపై ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ సిబ్బంది హైడ్రాకు చెప్పామనడం తప్పేనని అన్నారు. హైడ్రాకు చెప్పామంటూ సిబ్బంది తప్పించుకోవడమే అవుతుందని, అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ విభాగానికి పూర్తి అధికారాలు ఉంటాయని పేర్కొన్నారు.

## అమరావతి ఛాంపియన్‌షిప్ 2026.. తిరుపతిలో పోటీలను ప్రారంభించిన మంత్రులు

**తిరుపతి, ఆగస్టు 24:** తిరుపతిలో అమరావతి ఛాంపియన్‌షిప్ 2026 రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి.సోమవారం) ఉదయం ఎస్వీ యూనివర్సిటీ తారకరామా గ్రౌండ్స్‌లో హోం మంత్రి వంగలపూడి అనిత, మంత్రులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ.. గొప్ప గొప్ప విజయాలు సాధించిన వారికి క్రమశిక్షణ కీలమైందన్నారు. క్రమశిక్షణ ఉంటేనే జీవితంలో రానిస్తారని తెలిపారు. ఇప్పుడు క్రీడాకారులుగా ఉన్న వారిలో ఐఏఎస్, ఐపీఎస్‌లు అయ్యేవారు ఉంటారని చెప్పారు. క్రీడాకారులకు మూడు శాతం రిజర్వేషన్ ఇచ్చి, ఉద్యోగాలు ఇచ్చింది చంద్రబాబు ప్రభుత్వమని చెప్పుకొచ్చారు. మట్టిలో మాణిక్యాలను తీసుకురావటానికి కృషి చేస్తున్న తల్లిదండ్రులు,



ఉపాధ్యాయులకు హోం మంత్రి అనిత ధన్యవాదాలు తెలియజేశారు.కూటమి పాలనలో క్రీడలకు స్వర్ణయుగం: శాప్ ఛైర్మన్వైసీపీకి క్రీడాకారులంటే చిన్నచూపని శాప్ ఛైర్మన్ రవినాయుడు అన్నారు. క్రీడాకారులకు ఉద్యోగాలు ఇస్తే వద్దని అంటున్నారని మండిపడ్డారు. క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ పెడితే తప్పు పడుతున్నారని విమర్శించారు. వారు పాలనలో ఉన్నప్పుడు ఏనాడు ఎవరినీ నిదుయ్యబడ్డారు. కూటమి పాలనలో క్రీడలకు స్వర్ణయుగమని రవినాయుడు పేర్కొన్నారు.

## ఆసుపత్రిలో మంటలు- ముగ్గురు నవజాత శిశువులు మృతి

**అమరావతి:** ప్రభుత్వ ఆసుపత్రిలో మంటలు చెలరేగడంతో ఐసీయూలో ఉన్న ముగ్గురు నవజాత శిశువులు మృతిచెందారు. ఈ ఘటన మహారాష్ట్రలో సోమ వారం తెల్లవారుజామున జరిగింది. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఆసుపత్రికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అమరావతి జిల్లాలోని మహిళా జనరల్ ఆసుపత్రిలో ఈ అగ్ని ప్రమాదం జరిగింది. ఆసుపత్రిలోని మూడో అంతస్తులో తెల్లవారుజామున ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న ఆసుపత్రి సిబ్బంది మంటలను ఆర్పడానికి తీవ్రంగా ప్రయత్నించారు. అయినప్పటికీ క్షణాల్లోనే మంటలు తీవ్ర రూపం దాల్చాయి.వెంటనే నర్సులు, ఇతర ఆస్పత్రి సిబ్బంది కలిసి నవజాత శిశువుల సంరక్షణ విభాగం(ఎన్ఐసీయూ) లోని 30



మంది పసికందులను బయటకు తీసుకొచ్చారు. అయితే అప్పటికే దట్టమైన పొగ అలముకోవడంతో మిగిలిన వారిని బయటకు తీసుకొచ్చేందుకు ఆలస్యమైంది. ఈ క్రమంలోనే ముగ్గురు నవజాత శిశువులు మృతిచెందారు. వెంటిలేటర్ పేలి మంటలు చెలరేగినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఘటన జరిగిన సమయంలో మొత్తం తొమ్మిది మంది శిశువులు అత్యవసర చికిత్సా విభాగంలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, ఈ ఘటనకు సంబంధించి అమరావతి పోలీసు కమిషనర్ స్పందించారు."సోమవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. చీ×జఖలో మొత్తం మూడు విభాగాలు ఉన్నాయి. ఈ మూడు విభాగాల్లో ఒక్కొక్కదాని లో 13 మంది చొప్పున, మొత్తం 39 మంది నవజాత శిశువులకు చికిత్స అందించే సామర్థ్యం ఉంది. అందులో ఒక విభాగంలో వెంటిలేటర్‌కు మంటలు అంటుకున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత 36 మంది నవజాత శిశువులను రక్షించాం. ఇక్కడ నెలలు నిండకుండా పుట్టిన, అలాగే తక్కువ బరువున్న, తీవ్ర అనారోగ్యంతో ఉన్న నవజాత శిశువులకు చికిత్స జరుగుతోంది. దట్టమైన పొగవల్ల తీవ్ర అస్వస్థకు గురైన శిశువులను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించాం. మరికొంతమందిని డివిజనల్ రెఫరల్ సర్వీసెస్ ఆసుపత్రికి తరలించాం. అక్కడ నలుగురు పిల్లలకు చికిత్స జరుగుతోంది. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది. అగ్ని ప్రమాదానికి సంబంధించిన కారణాలను త్వరలోనే కనుక్కుంటాం."– రాకేశ్ ఓలా, అమరావతి పోలీస్ కమిషనర్'బాధిత కుటుంబాలకు మంత్రి భరోసా'మరోవైపు, ఈ ఘటనపై రాష్ట్ర మంత్రి చంద్రశేఖర్ బావన్?కులే స్పందించారు. మరణాల పట్ల తాను తీవ్రంగా కలత చెందానని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అవసరమైన సహాయాన్ని అందిస్తుందని హామీ ఇచ్చారు. అలాగే, ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. గాయపడిన వారికి అవసరమైన అన్ని రకాల వైద్య సహాయ సహకారాలు అందుతున్నాయని చెప్పారు. పరిస్థితిని అధికార యంత్రాంగంగా పర్యవేక్షిస్తోందని పేర్కొన్నారు.

## గంజాయి పట్టిస్తే రూ.5 వేల బహుమతి తాగేవారిని పట్టిస్తే రూ.1,500

ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టడానికి ఏపీ పోలీస్ ప్రత్యేక విభాగం 'ఈగల్' సరికొత్త ప్రజా భాగస్వామ్య వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా విజయవాడ నగర పోలీస్ విభాగం 'ఈగల్ ఛాలెంజ్' పేరిట ఒక వినూత్న నగదు బహుమతి కార్యక్రమాన్ని ప్రారంభించింది. గంజాయి రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఈగల్ టీమ్ తీసుకుంటున్న ముఖ్యమైన చర్యల వివరాల గురించి ఇప్పుడు ప్రత్యేకంగా తెలుసుకుందాం.కార్యక్రమాన్ని ప్రారంభించిన అజిత్‌సింగ్ : విజయవాడ నగరంలో గంజాయిని తీసుకువస్తూ లేదా విక్రయిస్తూ ఎవరైనా పట్టుబడితే రూ. 5,000, అలాగే గంజాయి సేవిస్తూ (ధూమపానం చేస్తూ) పట్టుబడితే రూ. 1,500 బహుమతి ఇస్తామని విజయవాడ నగర పోలీసులు ప్రకటించారు. విజయవాడలో గంజాయి విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ ఎస్.వి. రాజశేఖర బాబు, 'ఈగల్' ఐజీ




ఎ.కె. రవికృష్ణ తెలిపారు. ఆదివారం విజయవాడలోని అజిత్‌సింగ్‌నగర్ సెయింట్ ఆన్స్ స్కూల్‌లో 'ఈగల్ ఛాలెంజ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. గంజాయిని అరికట్టేందుకు పోలీసులు చేపట్టిన కార్యక్రమాలను వారు వివరించారు. నగదు బహుమతిని ప్రకటించిన ఈగల్ : ఇటీవల ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో గంజాయి కేసులకు సంబంధించి 1,287 మందిని పోలీసులు విచారించారు. వీరిలో 1,000 మందికి పైగా పరీక్షల్లో నెగటివ్ ఫలితం వచ్చింది. అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పరీక్షించిన 469 మందిలో 128 మందికి గంజాయి పాజిటివ్ అని తేలింది. గంజాయి సేవించిన 129వ వ్యక్తి గురించి సమాచారం ఇస్తే రూ. 1,500 నగదు బహుమతి ఇస్తామని అజిత్‌సింగ్‌నగర్ సీఐ చంద్రశేఖర్ ప్రకటించారు. గంజాయి రవాణా, విక్రయాలపై సమాచారం అందిస్తే రూ. 5,000 బహుమతి ఇస్తామని తెలిపారు.ఈగల్ కాల్ సెంటర్ ద్వారా సేవలు : 32 మందిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద చర్యలు 'ఈగల్ ఛాలెంజ్'లో భాగంగా, గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న 32 మందిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు సీపీ ఎస్.వి. రాజశేఖర బాబు తెలిపారు. దీనికి సంబంధించిన సమాచారాన్ని సేకరించేందుకే 'ఈగల్ ఛాలెంజ్' కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 40,000 విద్యాసంస్థల్లో 'డ్రగ్స్ నో బ్రో' పేరుతో 'ఈగల్ క్లబ్స్' ఏర్పాటు చేశామని, 849 హాట్‌స్పాట్‌లను గుర్తించామని ఈగల్ ఐజీ ఎ.కె. రవికృష్ణ తెలిపారు. 'ఈగల్ కాల్ సెంటర్' ఏర్పాటు చేసిన తర్వాత తల్లులు స్వయంగా ఫోన్ చేసి సమాచారం అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఏడాది కాలంగా ఈగల్ బృందం చేపట్టిన కార్యకలాపాలను 'ఈగల్' కార్యక్రమం వివరిస్తుంది.

## మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్.



**గుంటూరు, ఆగస్టు 24:** గుంటూరు జిల్లాలోని మంగళగిరి టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, పోలీస్, భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులే అధికంగా వచ్చాయని మంత్రి తెలిపారు. ముఖ్యంగా భూ సమస్యలు, రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న అంశాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పార్టీ గ్రీవెన్స్ ద్వారా ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని చెప్పారు. వచ్చిన ప్రతి అర్జీని నమోదు చేసి.. సమస్య పరిష్కారమయ్యే వరకూ ఫాలోఅప్ చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పొంగూరు నారాయణ మాట్లాడుతూ..' ప్రజా సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారు. గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత రెవెన్యూ మంత్రితో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చాం. టీడీపీ కార్యాలయం కేవలం పార్టీ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజల సమస్యలు విని.. పరిష్కారం చూపించే వేదికగా పనిచేస్తోంది. ప్రజల సమస్యలను మంత్రులు.. ప్రజాప్రతినిధులు నేరుగా స్వీకరించి పరిష్కరించే విధంగా గ్రీవెన్స్ వ్యవస్థ కొనసాగుతోంది. మంత్రి నారా లోకేశ్ సైతం ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో ఏ మూలన సమస్య ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమం' అని మంత్రి తెలిపారు.

## అర్హులకు త్వరలో కొత్త ఇళ్లు, పెన్షన్లు

**కర్నూలు, ఆగస్టు 24:** ఎల్‌నినో ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ఆదుకునేందుకు ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ కాలువలకు సాగునీరు అందించామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు వంద శాతం విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. రైజింగ్ స్టార్‌గా నారా లోకేశ్ నాయకత్వంలో డ్రోన్ హబ్‌తో పాటు పలు పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రజలకు తాగునీటిని




అందించి ఆదుకుంటామన్నారు.కర్నూలు జిల్లాకు రెండు విడతల్లో మొత్తం 10 గురుకుల పాఠశాలలు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. జిల్లాలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు కూడా కృషి చేస్తామని చెప్పారు. వచ్చే ఏడాది ఆలూరుకు ఒక గురుకుల పాఠశాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం బీసీల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. డీఎస్సీ ద్వారా మరోసారి ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు మంత్రి లోకేశ్ సిద్ధంగా ఉన్నారని చెప్పారు.పోలవరం, రాయలసీమ అంశాలపై మాట్లాడే హక్కు ప్రతిపక్షాలకు లేదని నిమ్మల విమర్శించారు. గత రెండేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు ఎంత ఖర్చు చేశారనే అంశంపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ చేశారు. అర్హులైన ప్రజలకు కొత్త ఇళ్లు, పెన్షన్లను త్వరలో అందిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు.

## తిరుపతిలో డ్రోన్ బ్యాటరీ తగిలి హోంమంత్రి అనితకు స్వల్పగాయం

**అమరావతి :**అమరావతి ఛాంపియన్‌షిప్‌లో హోం మంత్రి అనితకు గాయంప్రమాదవశాత్తు చేతిపై పడిన డ్రోన్ బ్యాటరీగాయపడినా ప్రసంగాన్ని కొనసాగించిన మంత్రిఘటనపై విచారణ జరుపుతున్న పోలీసులు తిరుపతిలో అమరావతి ఛాంపియన్‌షిప్ కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితకు స్వల్ప గాయమైంది. ఓ డ్రోన్‌కు చెందిన బ్యాటరీ ప్రమాదవశాత్తు ఆమె చేతిపై పడటంతో ఈ ఘటన జరిగింది.వివరాల్లోకి వెళితే, అమరావతి ఛాంపియన్‌షిప్ 2026 కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో ఓ డ్రోన్‌కు సంబంధించిన బ్యాటరీ ఛార్జింగ్ తగ్గిపోయింది. దాంతో ఆ డ్రోన్ కిందికి పడిపోగా, దాంట్లోని బ్యాటరీ ఊడి, నేరుగా వేదికపై ఉన్న మంత్రి అనిత కుడిచేతిపై పడింది. ఈ అనూహ్య ఘటనతో



అక్కడున్న అధికారులు, భద్రతా సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే అప్రమత్తమైన ఎస్పీ సుబ్బరాయుడు, మంత్రి అనితకు ప్రథమ చికిత్స అందించి, గాయమైన చేతికి బ్యాండేజ్ వేశారు.అయితే, చేతికి గాయమైనప్పటికీ మంత్రి అనిత బ్యాండేజ్‌తోనే తన ప్రసంగాన్ని పూర్తి చేశారు. గాయం తీవ్రమైనది కాకపోవడంతో అధికారులు, పార్టీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నారు.ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించి, ప్రమాదానికి కారణమైన డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సాంకేతిక లోపం వల్లే ఈ ప్రమాదం జరిగిందా, లేక నిర్వాహకుల నిర్లక్ష్యం కారణమా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటన నేపథ్యంలో వీఐపీల భద్రత, కార్యక్రమాల్లో డ్రోన్ల వినియోగంపై నిబంధనలను సమీక్షించనున్నట్లు తెలుస్తోంది.

## ఏపీకి ఉపరాష్ట్రపతి.. స్వాగతం పలికిన నారా లోకేశ్

**ఏలూరు జిల్లా**ఏలూరు జిల్లాలో పర్యటిస్తున్న భారత ఉపరాష్ట్ర పతి సీపీ రాధాకృష్ణన్దేశంలోనే తొలి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ మొక్కజొన్న విత్తనాన్ని ఆవిష్కరించనున్న ఉపరాష్ట్రపతిఈ కార్యక్రమం లో పాల్గొననున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు నాయుడుఇది రైతులకు మేలు చేకూర్చే కీలక ముందడుగు అన్న మంత్రి నారా లోకేశ్ ఉపరాష్ట్రపతి రాక సందర్భంగా ఏలూరు, కృష్ణా జిల్లాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్నారు. ఏలూరు జిల్లా ముసునూరు మండలంలో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొనేందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు గన్నవరం విమానాశ్రయంలో మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు. ఈ పర్యటనలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పాలుపంచుకోనున్నారు. వివరాల్లోకి వెళితే, ముసునూరు గ్రామంలోని గౌర్మెట్ పాప్‌కార్న్ పరిశ్రమ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా, ఆ సంస్థ



ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన దేశంలోనే మొట్టమొదటి నాన్-జీఎంఓ (జన్యుపరంగా మార్పు చేయని) పాప్‌కార్న్ మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాన్ని ఉపరాష్ట్రపతి లాంఛనంగా ఆవిష్కరిస్తారు. అనంతరం పాప్‌కార్న్ సాగు చేస్తున్న మొక్కజొన్న రైతులను సత్కరించనున్నారు. వ్యవసాయ రంగంలో ఇది ఒక ముఖ్యమైన ఆవిష్కరణగా భావిస్తున్నారు.ఈ పర్యటనపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఉపరాష్ట్రపతి ఏలూరుకు స్వాగతం పలకడం ఆనందంగా ఉందని తెలిపారు. "రైతుల కోసం ఆవిష్కరణలు, వారికి మరింత విలువను సృష్టించే దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగు" అని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.ఉపరాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి స్వయంగా కార్యక్రమ ప్రాంగణాన్ని పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఉపరాష్ట్రపతి భద్రతా సిబ్బంది, ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి, ఏలూరు రేంజ్ ఐజీపీ జీవీజీ అశోక్ కుమార్, ఏలూరు, కృష్ణా జిల్లాల ఎస్పీలతో కూడిన ఉన్నత స్థాయి బృందం అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్ సమావేశం నిర్వహించి భద్రతను సమీక్షించింది. ఉపరాష్ట్రపతి ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి మార్గంలో ముసునూరుకు ప్రయాణమయ్యారు.

## ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం.. నీటిని పొదుపుగా వాడాలి

**శ్రీ సత్యసాయి, ఆగస్టు 24:** జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకున్నాయని, నీటిని పొదుపుగా వాడాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. 15 ఏళ్లుగా ఇలాంటి విపత్కర పరిస్థితులను చూడలేదని పేర్కొన్నారు. సాగు చేసిన పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో రైతులు పరిస్థితిని అర్థం చేసుకుని, కొత్తగా బోరుబావులు వేయడాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, ప్రస్తుత పరిస్థితుల్లో బోర్ల కోసం పోటీ పడకుండా సహకరించాలని రైతులను కోరారు. తీవ్రమైన ఎల్‌నినో ప్రభావాన్ని అందరూ సమష్టిగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.చెర్లోపల్లి రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపుతాం.ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే కందికుంట



వెంకట ప్రసాద్ భరోసా ఇచ్చారు. హంద్రీ--నీవా ద్వారా చెర్లోపల్లి రిజర్వాయర్‌కు నీటిని అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెర్లోపల్లి రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నీటితో నింపేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతులు అవగాహన లేకుండా నిర్ణయాలు తీసుకోవద్దని, నీటి సంరక్షణలో ప్రభుత్వానికి సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు వార్తా దినపత్రిక
మంగళవారం , ఆగస్టు 25, 2026



# పంత్ సరికొత్త చరిత్ర..

భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మరో అరుదైన చారిత్రాత్మక రికార్డును సాధించాడు. విదేశాల్లో లేదా న్యూట్రల్ వేదికల్లో జరిగిన టెస్టుల్లో భారత వికెట్ కీపర్‌గా అత్యధిక పరుగులు సాధించిన లెజెండరీ క్రికెటర్ ఎంఎస్ ధోనీ పేరిట ఉన్న ఆల్ టైమ్ రికార్డును పంత్ బ్రేక్ చేశాడు. కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్ట్ రెండో రోజు ఆటలో పంత్ ఈ ఘనతను నమోదు చేశాడు. ఈ విభాగంలో 2500 పరుగుల మార్కును దాటిన పంత్, ధోనీ సాధించిన 2496 పరుగుల రికార్డును అధిగమించి అగ్రస్థానంలో నిలిచాడు. ధోనీ 32.84 సగటుతో ఆ పరుగులు చేయగా, పంత్ దాదాపు 42 సగటుతో ఈ మైలురాయిని అందుకోవడం గమనార్హం. ఈ లిస్టులో ఫరూక్ ఇంజనీర్ (1209 రన్స్), సయ్యద్ కిర్మాణి (1109 రన్స్), కిరణ్ మోరే (901 రన్స్) తర్వాతి స్థానాల్లో నిలిచారు.. ఈ రికార్డు నమోదు కావడానికి ఒక రోజు ముందు పంత్ మైదానంలో తీవ్ర గాయానికి లోనయ్యాడు. మొదటి రోజు ఆట మూడో సెషన్‌లో శ్రీలంక పేసర్ లహిరు కుమార వేసిన షార్ట్ పిచ్ బంతిని పుల్ చేసే క్రమంలో పంత్ ఎడమ చేతి మణికట్టుకు గాయం అయింది. నొప్పితో విలవిల్లాడిన పంత్ కు భారత జట్టు ఫిజియో ఐస్ ప్యాక్ పెట్టి కట్టు కట్టినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ తీవ్ర అసౌకర్యంగా అనిపించడంతో 15 బంతుల్లో 3 పరుగులు చేసిన తర్వాత 58వ ఓవర్లో పంత్ రిటైర్డ్ హర్ట్ గా వెనుదిరిగాడు. గాయం తీవ్రత భయపెట్టినప్పటికీ, రెండో రోజు ఉదయం భారత్ ఆరో వికెట్ కోల్పోయిన తర్వాత పంత్ తిరిగి బ్యాటింగ్ కు వచ్చాడు. అసిథ ఫెర్నాండో, ఇతర లంక పేసర్లు వరుసగా బౌన్సర్లతో దాడి చేస్తూ అతడి భుజానికి కూడా బంతులు తాకించినా పంత్ ఏమాత్రం లెక్క చేయలేదు. నొప్పిని భరిస్తూనే మరో వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ తో కలిసి జట్టు ఇన్నింగ్స్ ను ముందుకు నడిపించాడు. ఇద్దరూ కలిసి సమయోచిత భాగస్వామ్యంతో లంక బౌలర్లను దీటుగా ఎదుర్కొని స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లారు. శ్రీలంక బౌలర్లు తీవ్రంగా ఒత్తిడి తెస్తున్న సమయంలో పంత్ చూపిన అంకితభావం జట్టుకు కొండంత బలాన్ని ఇచ్చిందనడంలో సందేహం లేదు. ఇక వీళ్లిద్దరూ సాధికారికంగా



బ్యాటింగ్ చేస్తూ, అబేధ్యమైన ఏడో వికెట్ కు 112 పరుగులు జోడించారు. లంచ్ విరామ సమయానికి టీమిండియా 112 ఓవర్లలో 6 వికెట్లకు 419 పరుగులు చేసింది. పంత్ (63 బ్యాటింగ్)తో పాటు జురేల్ (59 బ్యాటింగ్) అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. ఫెర్నాండోకు నాలుగు వికెట్లు దక్కాయి. ఇప్పటికే గాలే టెస్ట్ లో భారత్ 165 రన్స్ తో గెలిచి సిరీస్ లో 1-0 లీడ్ లో ఉండగా, కొలంబోలోనూ పంత్ పోరాటంతో జట్టు పటిష్ట స్థితికి చేరింది.

# భారీ స్కోర్ వద్ద భారత్ డిక్లేర్డ్!

## • ధ్రువ్ జురెల్ అజేయ శతకం

శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా భారీ స్కోర్ చేసింది. ధ్రువ్ జురెల్(177 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 115 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 503/9 భారీ స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసింది. రిషభ్ పంత్(89 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. తొలి రోజు ఆటలో దేవదత్ పడిక్కల్(193 బంతుల్లో 12 ఫోర్లతో 117) సెంచరీతో చెలరేగగా.. శుభ్‌మన్ గిల్(108 బంతుల్లో 6 ఫోర్లతో 50) హాఫ్ సెంచరీతో రాణించిన సంగతి తెలిసిందే. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/106) నాలుగు వికెట్లు తీయగా..ప్రభాత్ జయసూర్య కేశర నువాంత్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. లాహిరు కుమారాకు ఒక వికెట్ దక్కింది. అనంతరం శ్రీలంక బ్యాటింగ్‌కు దిగగా 2 బంతులు పడగానే వర్షం అంతరాయం కలిగించింది. ఆ తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా.. శ్రీలంక 3 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 8 పరుగులు చేసింది. లాహిరు ఉడారా(1) ప్రసిధ్ కృష్ణ ఔట్ చేయగా.. ప్రభాత్ జయసూర్య(2)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. వర్షం కారణంగా రెండో రోజు 56 ఓవర్ల ఆటనే సాధ్యమైంది. 300/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓవర్‌నైట్ బ్యాటర్ సారాన్ష్ జైన్(6) రెండు పరుగులు మాత్రమే చేసి అసితా ఫెర్నాండో బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. దాంతో తొలి రోజు ఆటలో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన రిషభ్ పంత్ మళ్లీ బ్యాటింగ్‌కు దిగాడు. ధ్రువ్ జురెల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. తనదైన శైలిలో చెలరేగిన ఈ జోడీ వేగంగా పరుగులు రాబట్టింది. ముఖ్యంగా పంత్ భారీ షాట్లతో లంకబౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో పంత్ 81 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకోగా.. ధ్రువ్ జురెల్ 97 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. దాంతో భారత్ 419/6 స్కోర్ వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో పంత్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. అయితే అతన్ని కుశార నువాంత క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో ఏడో వికెట్‌కు నమోదైన 112



పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి మానవ్ సుతార్ రాగా.. ధ్రువ్ జురెల్ తన జోరును కొనసాగించాడు. ఆచితూచిన ఆడిన మానవ్ సుతార్(18)ను ప్రబాత్ జయసూర్య కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చగా.. సిరాజ్‌తో కలిసి ధ్రువ్ జురెల్ రెండో సెషన్‌ను ముగించాడు. వర్షం కారణంగా కాస్త ముందుగానే ఈ సెషన్ ముగిసింది. ఆఖరి సెషన్‌లో దూకుడుగా ఆడిన ధ్రువ్ జురెల్ 171 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఆ వెంటనే భారీ సిక్సర్‌తో ధ్రువ్ జురెల్ తన జోరు కనబర్చగా.. సిరాజ్(3) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. దూకుడుగా ఆడిన ధ్రువ్ జురెల్ వేగంగా పరుగులు రాబట్టి జట్టు స్కోర్‌ను 500 ధాటించాడు. ఆ వెంటనే భారత్ తమ ఇన్నింగ్స్‌ను డిక్లెర్డ్ చేసింది.

# యశస్వి జైస్వాల్‌కు భారీ ఊరట!

టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు భారీ ఊరట లభించింది. శ్రీలంక ప్లేయర్ అసిత ఫెర్నాండోతో గొడవ పడిన ఘటనలో ఐసీసీ జరిమానాతో సరిపెట్టింది. యశస్వి జైస్వాల్‌తో పాటు అసిత ఫెర్నాండో మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించింది. ఈ ఘటనలో యశస్వి జైస్వాల్‌దే తప్పంటూ మాజీ క్రికెటర్లు, కామెంటేటర్లు తీర్పు ఇచ్చారు. దాంతో యశస్వి జైస్వాల్‌పై నిషేధం పడుతుందని అంతా అనుకున్నారు. కానీ మ్యాచ్ రిఫరీ లెవెల్-1 నేరంగా పరిగణించి రూల్స్ ప్రకారం చర్యలు తీసుకున్నారు.

ఈ చర్యలకు సంబంధించి ఐసీసీ ఓ ప్రకటనను విడుదల చేసింది. 'ఆదివారం కొలంబో వేదికగా మొదలైన రెండో టెస్ట్ తొలి రోజున ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవెల్ 1 రూల్‌ను ఉల్లంఘించిన శ్రీలంక పేసర్ అసితా ఫెర్నాండో, భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ల మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తూ మ్యాచ్ రిఫరీ చర్యలు తీసుకున్నారు. ఆర్టికల్ 2.12 ప్రకారం ఒక ప్లేయర్, సపోర్ట్ స్టాఫ్, అంపైర్‌తో భౌతిక ఘర్షణకు దిగడం నేరం.మ్యాచ్ ఫీజు కోతతో పాటు చెరో డీ మెరిట్ పాయింట్ కేటాయించారు. తమ తప్పులను ఫెర్నాండో, జైస్వాల్ అంగీకరించారు. దాంతో అధికారిక విచారణ అవసరం లేకుండానే ఈ శిక్షలు ఖరారు చేస్తున్నాం. లెవెల్ 1 ఉల్లంఘనకు పాల్పడినప్పుడు కనీస శిక్షగా హెచ్చరిక, గరిష్టంగా ఆటగాడి మ్యాచ్ ఫీజులో 50 శాతం, ఒకటి లేదా



రెండు డీమెరిట్ పాయింట్స్ ఉంటాయి.'అని ఐసీసీ తమ ప్రకటనలో పేర్కొంది. కొలంబో వేదికగా ఆదివారం ప్రారంభమైన రెండో టెస్ట్‌లో యశస్వి జైస్వాల్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. అసిత ఫెర్నాండో వేసిన ఒకే ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు బాదాడు. ఆ తర్వాత ఫెర్నాండో ఒక అద్భుతమైన డెలివరీతో జైస్వాల్‌ను 45 పరుగుల వద్ద క్లీన్ బౌల్డ్ చేశాడు. వికెట్ తీసిన అనంతరం ఫెర్నాండో అత్యుత్సాహంగా సెలెబ్రేట్ చేసుకున్నాడు. ఈ క్రమంలో అతను ఏదో మాట అన్నాడు. అది విన్న జైస్వాల్ ఆగ్రహంతో అతనిపైకి దూసుకెళ్లాడు. ఒకరికొకరు ఎదురెదురుగా నిలబడి నోరుపారేసుకున్నారు. ఈ క్రమంలో జైస్వాల్ హెల్మెట్ ఫెర్నాండో నుదుటికి తాకింది. దాంతో శ్రీలంక కెప్టెన్ ధనంజయ డిసిల్వా, వైస్ కెప్టెన్ కమిందు మెండిస్ జోక్యం చేసుకొని ఇద్దర్నీ విడదీసాడు.

# సీఎస్‌కే కోచ్‌గా దినేశ్ కార్తీక్‌ను నియమించండి

## • ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హేడెన్ సూచన



టీమిండియా మాజీ క్రికెటర్ దినేష్ కార్తీక్‌ను చెన్నైసూపర్ కింగ్స్(సీఎస్‌కే) హెడ్ కోచ్‌గా నియమించాలని ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హేడెన్ సూచించాడు. ఐదు సార్లు ఛాంపియన్ అయిన సీఎస్‌కేకు విదేశీ కోచ్‌ల కంటే స్థానిక వ్యక్తులే మెరుగైన సేవలు అందించగలరని మాథ్యూ హేడెన్ అభిప్రాయపడ్డాడు.చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) హెడ్ కోచ్‌గా 18 ఏళ్ల పాటు సేవలందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ ఇటీవలే ఆ బాధ్యతల నుంచి తప్పుకున్న సంగతి తెలిసిందే. అతను ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టగా.. సీఎస్‌కే నయా హెడ్ కోచ్ కోసం అన్వేషణ మొదలుపెట్టింది.తాజాగా ఈ వ్యవహారంపై మాట్లాడిన మాథ్యూ హేడెన్.. స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను తప్పించడం సాహోసోపేతమైన నిర్ణయంగా పేర్కొన్నాడు. స్టార్ స్పోర్ట్స్ షోలో మాట్లాడిన మాథ్యూ హేడెన్.. దినేష్ కార్తీక్‌కు హెడ్ కోచ్ పదవి బాధ్యతలు ఇవ్వాలని చెప్పాడు. 'సీఎస్‌కే వంటి పెద్ద జట్టుకు విదేశీ కోచ్ కోచ్ కంటే స్థానిక నేపథ్యం ఉన్న కోచ్ మరింత అనుకూలంగా ఉంటారు. దినేష్ కార్తీక్‌కు చెన్నై క్రికెట్ సంస్కృతి బాగా తెలుసు. కాబట్టి సీఎస్‌కే హెడ్ కోచ్ పదవికి దినేష్ కార్తీక్ సరైన వ్యక్తి. ఐపీఎల్ నుంచి రిటైర్ అయిన తర్వాత దినేశ్ కార్తీక్.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)కి బ్యాటింగ్ కోచ్, కన్సల్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మార్గదర్శకత్వంలో ఆర్‌సీబీ 2025లో తమ తొలి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకోవడమే కాకుండా ఐపీఎల్ 2026 సీజన్‌లోనూ టైటిల్ నిలబెట్టుకుంది. సీఎస్‌కే హెడ్ కోచ్ పదవి చేపట్టేందుకు దినేష్ కార్తీక్ సరిగ్గా సరిపోతాడు.'అని మాథ్యూ హేడెన్ చెప్పుకొచ్చాడు. కొత్త కోచ్ ఎంపికపై సీఎస్‌కే ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రటకన చేయలేదు. కానీ పలువురు మాజీ ఆటగాళ్ల పేర్లు ప్రచారంలో ఉన్నాయి.ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ పేరు బలంగా వినిపిస్తోంది. ఫ్లేమింగ్ పర్యవేక్షణలో ఐదు టైటిళ్లు గెలిచిన సీఎస్‌కే.. గత మూడు సీజన్లలో దారుణంగా విఫలమైంది. కనీసం ప్లే ఆఫ్స్ కూడా చేరలేకపోయింది. దాంతోనే అతన్ని సీఎస్‌కే తప్పించింది.

# కుల్దీప్ యాదవ్‌కు నిజంగా వైరల్ ఫీవరే

## స్పష్టం చేసిన బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్

టీమిండియా రిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు నిజంగా వైరల్ ఫీవరేనని బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ స్పష్టం చేశాడు. అబద్దం చెప్పి అతన్ని పక్కన పెట్టాల్సిన అవసరం తమకు లేదన్నాడు. శ్రీలంకతో కొలంబో వేదికగా ఆదివారం ప్రారంభమైన రెండో టెస్ట్‌కు కుల్దీప్ యాదవ్ దూరమైన సంగతి తెలిసిందే.వైరల్ ఫీవర్‌తోనే కుల్దీప్ యాదవ్ దూరమయ్యాడని ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు బీసీసీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. 'కుల్దీప్ యాదవ్ తన వైరల్ ఫీవర్ నుంచి పూర్తిగా కోలుకోలేదు. శ్రీలంకతో రెండో టెస్ట్‌కు అతను దూరమయ్యాడు. అవసరమైతే కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా కుల్దీప్ బరిలోకి దిగగలడు.'అని తెలిపింది.అయితే ఈ ప్రకటనను మెజార్టీ అభిమానులు విశ్వసించలేదు. వైరల్ ఫీవర్ పేరిట కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టు నుంచి తప్పించారని ఆరోపించారు. తొలి టెస్ట్‌లో కుల్దీప్ యాదవ్ ప్రభావం చూపలేకపోయాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో ఒకే ఒక్క వికెట్ తీయడంతో అతన్ని తప్పిస్తారనే ప్రచారం జోరుగా సాగింది. 33 ఏళ్ల సారాన్ష్ జైన్‌కు అవకాశం ఇస్తారనే అభిప్రాయం వ్యక్తమైంది. ఈ క్రమంలోనే వైరల్ ఫీవర్ అంటూ బీసీసీఐ చేసిన ప్రకటనపై నెటిజన్లు సందేహం వ్యక్తం చేశారు. తొలి రోజు ఆట అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న సితాన్ష్ కోటక్‌ను మీడియా ప్రతినిధులు ఈ విషయంపై ప్రశ్నించగా.. తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ఇదేం ప్రశ్న ఇలా ఎలా ఆలోచిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'ఇది ఏ మాత్రం సందర్భోచితమైన ప్రశ్న కాదు. కుల్దీప్ యాదవ్‌కు గాలే నుంచి వచ్చేటప్పుడే వైరల్ ఫీవర్ సోకింది. జట్టుకు ఆఫ్-స్పిన్నర్ అవసరమైతే.. కుల్దీప్ యాదవ్ అనారోగ్యానికి గురయ్యాడని చెప్పాల్సిన అవసరం మాకు లేదు. అతను ఆడే స్థితిలో లేనప్పుడు ఒకవేళ ఫిట్‌గా ఉంటే ఏం చేసేవారని అడగడం సరికాదు. ఇలా ఆలోచించడం కూడా అన్యాయం'అని సితాన్ష్ కోటక్ ఘాటుగా బదులిచ్చాడు. రిషభ్ పంత్ గాయం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సీరియస్ ఇంజ్యూరీ కాదని సితాన్ష్ కోటక్ తెలిపాడు. అతను తిరిగి బ్యాటింగ్ చేస్తాడని చెప్పాడు. మైదానంలో యశస్వి జైస్వాల్, అసితా ఫెర్నాండో గొడవపై స్పందిస్తూ.. ఆటలో ఇవన్నీ సహజమని అభిప్రాయపడ్డాడు. బౌలర్ ఏదో అన్నాడని, కానీ యశస్వి జైస్వాల్ అలా దూసుకెళ్తాడని తాను అనుకోలేదని చెప్పాడు. కుల్దీప్ యాదవ్ గైర్హాజరీతో 33 ఏళ్ల సరాన్ష్ జైన్ అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 85 ఓవర్లలో 5 వికెట్లకు 300 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్(193 బంతుల్లో 12 ఫోర్లతో 117) మరో శతకంతో చెలరేగగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(108 బంతుల్లో 6 ఫోర్లతో 50) హాఫ్ సెంచరీతో రాణించాడు. రవీంద్ర జడేజా(43), యశస్వి జైస్వాల్(45) తృటిలో హాఫ్ సెంచరీలు చేజార్చుకున్నారు. క్రీజులో ధ్రువ్ జురెల్(7 బ్యాటింగ్)తో పాటు సరాన్ష్ జైన్(4 బ్యాటింగ్) ఉన్నాడు. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో మూడు వికెట్లు తీయగా.. లాహిరు కుమార, కేశర నువాంత తలో వికెట్ తీసారు.

# దేవదత్ పడిక్కల్ వరుస సెంచరీలు

శ్రీలంక పర్యటనలో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అదరగొడుతున్నాడు. ఇటీవల గాలె వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో (167, 44) రాణించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తాజాగా కొలంబో టెస్టులోనూ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ, మరో సెంచరీ నమోదు చేశాడు. అదివారం ప్రారంభమైన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో పడిక్కల్ 117 పరుగులతో రాణించాడు. దీంతో ప్రస్తుతం అందరి కళ్లూ పడిక్కల్‌పై పడ్డాయి. ఛతేశ్వర్ పుజారా తర్వాత టెస్టుల్లో భారత్‌కు నెం 3 స్థానాన్ని భర్తీ చేయడం సవాల్‌గా మారింది. టెస్టుల్లో కీలకమైన ఈ వన్‌డౌన్‌లో పలువురు బ్యాటర్లను పరీక్షించి చూసింది. అయితే గతేడాది సాయి సుదర్శన్ సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేయడంతో అతడే ఆ ప్లేస్‌లో బ్యాటింగ్ చేస్తున్నాడు.



అప్పట్నుంచి నెం 3 స్థానానికి మేనేజ్‌మెంట్ కూడా సుదర్శన్ పేరునే పరిశీలిస్తుంది. ఈ లంక పర్యటనలో కూడా మొదట సుదర్శన్‌నే ఎంపిక చేసింది. అయితే అతడు గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో ఆ ఛాన్స్ పడిక్కల్‌కు వచ్చింది. అలా వచ్చిన అవకాశాన్ని పడిక్కల్ పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్నాడు. ప్రత్యర్థి బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని పరుగులు సాధిస్తున్నాడు. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 167 పరుగుల భారీ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. నంబర్ 3 స్థానంలో కొంతకాలంగా ఫాస్ట్, స్పిన్ బౌలింగ్ రెండింటినీ సమర్థవంతంగా ఎదుర్కొనే టెస్టు బ్యాటర్ కోసం మేనేజ్‌మెంట్ అన్వేషిస్తోంది. అయితే ఈ సిరీస్‌లో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో సెంచరీ నమోదు చేయడంతో పడిక్కల్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. సుదర్శన్ వచ్చినా జట్టులోంచి పడిక్కల్‌ను తీసివేయొద్దంటూ ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. తన ప్రదర్శనతోనూ పడిక్కల్ సెలక్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. నిలకడగా రాణిస్తూ పరుగులు చేస్తుండడంతో ఈ ప్లేస్‌కు పడిక్కల్ సెట్ అయిపోయినట్లే అని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత టూర్‌లో రెండు సెంచరీలు సాధించినంత మాత్రాన పడిక్కల్‌ను అప్పుడే నెం 3 బ్యాటర్ అని కన్ఫర్మ్ అయిపోడానికి వీల్లేదు. ఎందుకంటే అతడికి అసలు పరీక్ష ఇప్పుడిప్పుడే మొదలవుతుంది. ఈ నిలకడను ఇలాగే కొనసాగిస్తేనే అతడికి వన్‌డౌన్‌లో అవకాశం ఉంటుంది. అంతేకానీ ఒకట్రెండు సిరీస్‌లకు మాత్రమే ఈ ప్రదర్శన పరిమితమైతే మాత్రం కనుమరుగైపోయే ప్రమాదం ఉంది. గతంలో ఎందరో క్రికెటర్లు వచ్చిన కొత్తలో అదరగొట్టేసి, ఆ తర్వాత తుస్సుమనిపించారు. వాళ్లంతా ఇప్పుడు కనుమరుగైపోయారు.

# దేవకన్యలా మెరిసిన మానస వారణాసి..





టాలీవుడ్ యంగ్ హీరోయిన్ మానస వారణాసి ఫెమినా మిస్ ఇండియా 2020 విజేత గా నిలిచారు. 'దేవకీ నందన వాసుదేవ' తో ఎంట్రీ ఇచ్చిన ఈ భామ ఇప్పుడు తన ట్రెడిషనల్ గ్రేస్‌తో కుర్రకారు గుండెలను కొల్లగొడుతోంది. హైదరాబాద్‌కే చెందిన ఈ ముద్దుగుమ్మ మిస్ వరల్డ్ 2021 పోటీల్లో టాప్-13లో నిలిచి దేశం గర్వపడేలా చేసింది. రీసెంట్‌గా రిలీజైన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో మంచి హిట్ కొట్టిన ఈ అందాల భామ, సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన లేటెస్ట్ ఫొటోషూట్ ప్రస్తుతం ఫ్యాన్స్‌ని మంత్రముగ్ధులను చేస్తోంది. 'బ్రీజ్' తాకిడికి రెక్కలు విప్పుకున్న అందం: మానస వారణాసి "బ్రషెడ్ బై ది బ్రయీజ్ "అంటూ ఇన్స్టాగ్రామ్‌లో పంచుకున్న పిక్స్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. లైట్‌వెయిట్, పారదర్శకమైన శారీ డ్రేప్‌లో ఆమె కనిపించిన తీరు దేవకన్యను తలపిస్తోంది. ఇక ప్లెయిన్ వైట్ స్లీవ్‌లెస్, హై-నెక్ బ్లౌజ్‌తో రూపొందించిన ఈ మోడరన్ అండ్ ట్రెడిషనల్ కాంబినేషన్ ఆమెకు ఎంతో క్లాసీ అండ్ ఫ్రెష్ లుక్‌ని ఇచ్చింది. సింపుల్ జ్యువెలరీ.. సోయగం డబుల్: ఎక్కువ హడావుడి లేకుండా మినిమల్ టచ్‌తో ఆమె చేసిన ఈ ఫొటోషూట్ అందరినీ ఆకట్టుకుంటోంది. సంప్రదాయబద్ధమైన సిల్వర్ ఝుంకాలు, చేతికి ఒక సన్నటి బ్రాస్‌లెట్ మాత్రమే ధరించి తన సహజ సౌందర్యాన్ని ప్రదర్శించింది. ఇక కామెంట్ బాక్స్‌లో నెటిజన్లు "ఏంజెల్", "అచ్చ తెలుగు అందం", "సూపర్బ్" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తూ లైకుల సునామీ సృష్టిస్తున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' హిట్‌తో ఫుల్ జోష్: మోడలింగ్‌లో రాణించిన మానస వారణాసి, నటనలోనూ తన మార్క్ చూపిస్తోంది. సంతోష్ శోభన్ సరసన ఆమె నటించిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'కపుల్ ఫ్రెండ్లీ' బాక్సాఫీస్ వద్ద మంచి హిట్ టాక్ తెచ్చుకోవడంతో ఈ భామ ఫుల్ ఖుషీగా ఉంది. ఇక అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో, యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్‌పై వచ్చిన ఈ సినిమాతో నటిగా మానస తన స్థానాన్ని మరింత బలంగా సుస్థిరం చేసుకుంది. అందం, అభినయంతో పాటు హుందాతనంతో కూడిన సంప్రదాయ లుక్స్‌కి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది మానస వారణాసి. ఇక క్యూట్ అండ్ క్లాసీ ఫోజులతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ తెలంగాణ బ్యూటీ, రాబోయే రోజుల్లో తెలుగు చిత్రసీమలో మరిన్ని బిగ్ ఆఫర్లతో సంచలనం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఓ ఇంటివాడైన టాలీవుడ్ నటుడు ప్రిన్స్..

## న్యూజిలాండ్ లో ఘనంగా వివాహం




టాలీవుడ్ యంగ్ హీరో ప్రిన్స్ సెసిల్ ఓ ఇంటివాడయ్యాడు. తన ప్రియురాలు సాయి ప్రతిమ మెడలో మూడు ముళ్లు వేసి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాడు. న్యూజిలాండ్‌లోని వనాకా ప్రాంతంలో అత్యంత సుందరమైన ప్రదేశంలో వీరి వివాహం హిందూ సంప్రదాయ పద్ధతిలో వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు.

వివాహ వేడుకలో వధువు సాయి ప్రతిమ ఎరుపు రంగు పట్టుచీర, సంప్రదాయ ఆభరణాలతో మహారాణిలా మెరిసిపోగా, వరుడు ప్రిన్స్ ఐవరీ కలర్ ప్రింటెడ్ పైజామాలో రాజకుమారుడిలా కనిపించాడు. వీరి పెళ్లికి సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకోవడంతో, అవి క్షణాల్లో వైరల్ అయ్యాయి. ఈ నూతన జంటకు పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతూ కామెంట్లు పెడుతున్నారు.వీరిద్దరి ప్రేమకథ కూడా ఎంతో ఆసక్తికరంగా మొదలైంది. ప్రముఖ నటుడు ప్రియదర్శి ద్వారా ఒక కామన్ ఫ్రెండ్ వివాహ వేడుకలో ప్రిన్స్, సాయి ప్రతిమలకు తొలిసారి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం స్నేహంగా, ఆపై ప్రేమగా మారి ఇప్పుడు పెళ్లి పీటల వరకు చేరింది.'నీకు నాకు డ్యాష్ డ్యాష్' చిత్రంతో హీరోగా పరిచయమైన ప్రిన్స్, 'బస్ స్టాప్' సినిమాతో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'బిగ్ బాస్ తెలుగు' మొదటి సీజన్‌లో పాల్గొని తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. ఇటీవల 'డీజే టిల్లు', 'స్కంద' వంటి విజయవంతమైన చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ నటుడిగా తనను తాను నిరూపించుకుంటున్నాడు. ప్రస్తుతం ప్రిన్స్ మరికొన్ని ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు.

# 100 కోట్ల క్లబ్ దిశగా 'ఇరుముడి'

రవితేజ అంటే చాలు మాస్ ఆడియన్స్ ఊగిపోతారు. ఆయన సినిమాలలో యాక్షన్ ఉంటుంది .. ఎమోషన్ ఉంటుంది .. తనదైన కామెడీ ఉంటుంది. రొమాంటిక్ గా సాగిపోయే సాంగ్స్ ఉంటాయి. ఫైనల్ గా వీటన్నిటికీ మాస్ టచ్ ఉంటుంది. అయితే ఈ సారి మాత్రం ఆయన కాస్త డిఫరెంట్ గా డివోషనల్ టచ్ ఇస్తూ, 'ఇరుముడి' సినిమా చేశారు. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఈ నెల 21వ తేదీన భారీ ఓపెనింగ్స్ తో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టింది. తొలి రోజునే ప్రపంచవ్యాప్తంగా 24 కోట్లకు పైగా గ్రాస్ ను వసూలు చేసింది. మొదటి రోజునే హిట్ టాక్ రావడంతో, శనివారం నుంచి థియేటర్స్ పెంచవలసిన వచ్చింది. దాంతో ఈ సినిమా మరింత దూకుడు చూపిస్తూ వెళ్లింది. అలా మొదటి మూడు రోజులలో ఈ సినిమా 75 కోట్లకు పైగా గ్రాస్ ను రాబట్టింది. రెండు రోజులలోనే బ్రేక్ ఈవెన్ ను సాధించింది, రవితేజ కెరియర్లో చాలా వేగంగా ఈ స్థాయి వసూళ్లను రాబట్టిన సినిమాగా నిలిచింది. అలాగే రవితేజ కెరియర్లో యూ ఎస్ బాక్సాఫీస్ వైపు నుంచి, తొలి మిలియన్ డాలర్ మూవీగా నిలిచింది. ఇక సోమవారం రోజున కూడా ఈ సినిమా అదే జోరును కొనసాగిస్తుండటం విశేషం. 100 కోట్ల క్లబ్ లోకి ఈ సినిమా చేసే సమయం చాలా దగ్గరలోనే ఉంది. కూతురు పట్ల ఉన్న ప్రేమ .. ఆ కూతురును ఇచ్చిన అయ్యప్పస్వామి పట్ల భక్తి రవితేజ పాత్రలో ప్రధానమైన కోణాలుగా కనిపిస్తాయి. ఆడపిల్లలకు ఒక ఆశయం ఉండాలి .. వాళ్లు ధైర్యంగా పెరగాలి .. ఆదర్శంగా నిలవాలి అనే కాన్సెప్ట్ తో రూపొందిన ఈ సినిమాకి, పాటలు అదనపు బలంగా నిలిచాయి. విలేజ్ నేపథ్యంలోని హీరోయిజం .. విలేజ్ ను అడ్డాగా చేసుకుని దుర్మార్గాన్ని సాగించాలనుకున్న విలనిజం ఆవిష్కరణ ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. రవితేజ కెరియర్ లో గొప్ప హిట్ గా ఈ సినిమా నిలుస్తుందని చెప్పచ్చు.



# వివాదంతో పెద్ద ప్రచారం కొట్టేసిన వర్ధమాన నటి



సినిమా ప్రమోషన్లలో వినూత్న పద్ధతులు పాటించడం ఈ రోజుల్లో సర్వసాధారణమైపోయింది. అయితే ఇటీవల కన్నప్ప, బ్లాస్ట్ చిత్రాల ద్వారా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న వర్ధమాన నటి ప్రీతి ముకుందన్ పాల్గొన్న ఓ ప్రచార కార్యక్రమం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఓ పబ్లిక్ ఈవెంట్‌లో పాల్గొనడానికి ఆమెను గ్రాండ్‌గా రథంపై ఊరేగింపుగా తీసుకెళ్లడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ ఊరేగింపు సందర్భంగా అందాల భామను ప్రత్యక్షంగా చూసేందుకు అభిమానులు, జనం భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోయి సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో నెటిజన్లు మండిపడ్డారు. పబ్లిసిటీ స్టంట్ల పేరుతో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందంటూ పలువురు హితవు పలికారు ఇదే సమయంలో ప్రీతి ముకుందన్ కుటుంబ నేపథ్యం గురించి కూడా నెట్టింట ఒక ఆసక్తికరమైన ప్రచారం సాగుతోంది. భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌కు ఈ నటి మనవరాలు (గ్రాండ్ డాటర్) అంటూ వార్తలు వస్తున్నాయి. అయితే ఇందులో నిజం లేదని.. రామానుజన్ 1920లో తన 32వ ఏటనే సంతానం లేకుండా పరమపదించారని.. కాబట్టి ఆయనకు నేరుగా వారసులు ఎవరూ లేరని స్పష్టమవుతోంది. నెటిజన్లు అనుకుంటున్నట్లు రామానుజన్‌కు ప్రీతి ప్రత్యక్ష మనవరాలు కాకపోయినా ఆమె ఆయన కుటుంబానికి చెందిన వ్యక్తి కావడం విశేషం. ప్రీతి ముకుందన్‌కు రామానుజన్ వరుసకు ముత్తాత (గ్రేట్-గ్రాండ్ అంకుల్) అవుతారు. రామానుజన్ తమ్ముడి కుమారుడే అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కర్నాటిక్ జాజ్ గిటారిస్ట్ గిటార్ ప్రసన్న (ప్రసన్న రామస్వామి) .. ఆయన సోదరి డాక్టర్ దీపా ముకుందన్. ఈ డాక్టర్ దీపా ముకుందన్ మరెవరో కాదు, హీరోయిన్ ప్రీతి ముకుందన్ తల్లే.

# నన్ను హీరోగా వద్దన్నారు..

## అయినా నా డైరెక్టర్ వినలేదు: అర్జున్ దాస్

అర్జున్ దాస్, అదితి శంకర్ జంటగా ఆగస్ట్ 28న సినిమా విడుదల

దక్షిణాదిలో వేగంగా ఎదుగుతున్న నటుడు అర్జున్ దాస్, తన కొత్త సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యాడు. అదితి శంకర్‌తో కలిసి ఆయన హీరోగా నటించిన తమిళ రొమాంటిక్ డ్రామా 'ఒన్స్ మోర్'. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మాట్లాడిన అర్జున్ దాస్, దర్శకుడు విఘ్నేశ్ శ్రీకాంత్ తనపై ఉంచిన నమ్మకాన్ని గుర్తుచేసుకున్నాడు. హీరోగా తనను తొలగిస్తే సినిమా నిర్మిస్తామని పలు నిర్మాణ సంస్థలు ముందుకు వచ్చినా, దర్శకుడు మాత్రం తన కోసమే నిలబడ్డారని వెల్లడించాడు. ఈ సందర్భంగా అర్జున్ దాస్ మాట్లాడుతూ, "చాలా కాలం క్రితం దర్శకుడు శ్రీకాంత్ ఈ కథతో నా దగ్గరకు వచ్చాడు. మా కామన్ ఫ్రెండ్, డైరెక్టర్ సూర్య నారాయణ్ మా ఇద్దరినీ పరిచయం చేశారు. శ్రీకాంత్ చెప్పిన లైన్ నాకు చాలా అందంగా అనిపించింది" అని తెలిపాడు. అయితే, ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లే క్రమంలో ఎదురైన సవాళ్లను దాస్ వివరించాడు. "ఈ కథను చాలా నిర్మాణ సంస్థలకు శ్రీకాంత్ వినిపించాడు. కానీ వాళ్లలో చాలామంది 'హీరోని మార్చితే సినిమా చేస్తాం' అని చెప్పారు. కానీ అన్ని నిర్మాణ సంస్థలకూ శ్రీకాంత్ ఒకటే చెప్పాడు.. 'లేదు, నేను ఈ సినిమా అర్జున్ దాస్‌తోనే చేస్తాను' అని అతడు గట్టిగా చెప్పినట్లు" అర్జున్ దాస్ వెల్లడించాడు. ఎంతో కాలం ఎదురుచూసిన తర్వాత, దర్శకుడి ఆలోచనలతో ఏకీభవించిన నిర్మాత యువరాజ్ గణేశన్ ముందుకు రావడంతో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కిందని వివరించాడు. ఈ 'ఒన్స్ మోర్' చిత్రం ఈ ఏడాది ఆగస్ట్ 28న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అర్జున్ దాస్, అదితి శంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, మోడల్ సోనా ఓలికల్ ఒక కీలక పాత్రలో కనిపించనుంది. మలయాళంలో 'హృదయం', తెలుగులో 'హాయ్ నాన్న' వంటి చిత్రాలతో సంచలనం సృష్టించిన హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాతో తమిళ చిత్ర పరిశ్రమకు సంగీత దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.



# 'శుక్రాచార్యుడి యుద్ధరావం'.. ప్రశాంత్ వర్మ 'మహాకాళి' నుంచి అక్షయ్ ఖన్నా ఫస్ట్ గ్లింప్స్

ప్రశాంత్ వర్మ క్రియేటర్‌గా, పూజ కొల్లూరు దర్శకత్వంలో నిర్మాణం బ్లాక్‌బస్టర్ చిత్రం 'హనుమాన్'తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ చిత్రాన్ని అందిస్తున్నారు. 'మహాకాళి' అనే టైటిల్‌తో రానున్న ఈ చిత్రం నుంచి 'శుక్రాచార్యుడి యుద్ధరావం' పేరుతో ఫస్ట్ గ్లింప్స్‌ను సోమవారం విడుదల చేశారు. ఇందులో రాక్షసుల గురువు శుక్రాచార్యుడి పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా నటిస్తున్నారు.

తాజాగా విడుదల చేసిన ఈ గ్లింప్స్, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. »THE END BEGINS» (అంతం మొదలవుతుంది) అనే ట్యాగ్‌లైన్‌తో, గంభీరమైన వాతావరణంలో అక్షయ్ ఖన్నా లుక్, డైలాగ్ డెలివరీ ఆకట్టుకుంటున్నాయి. హనుమాన్ ప్రపంచానికి కొనసాగింపుగా వస్తున్న ఈ చిత్రంలో అసుర గురువు శుక్రాచార్యుడి పాత్ర ఎంత కీలకంగా ఉండబోతోందో ఈ గ్లింప్స్ స్పష్టం చేస్తోంది. ప్రశాంత్ వర్మ మార్క్ విజువల్స్, సౌండ్ డిజైన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ కథ, కాన్సెప్ట్ అందిస్తూ క్రియేటర్‌గా వ్యవహరించగా, పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఆర్‌కేడీ స్టూడియోస్ పతాకంపై రివాజ్ రమేష్ దుగ్గల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భూమి శెట్టి లీడ్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్ ఖన్నాతో పాటు శ్రియా రెడ్డి, రోహిత్ సరాఫ్, సముద్రఖని, నాజర్, మురళీ శర్మ, రజత్ కపూర్ వంటి భారీ తారాగణం నటిస్తోంది. స్మరణ్ సాయి సంగీతం అందిస్తున్నారు.



ఈ చిత్రాన్ని 2027 జనవరి 8న సంక్రాంతి కానుకగా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. 'హనుమాన్' విజయం తర్వాత పీవీసీయూ నుంచి వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569